PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 294 | విజయవాడ, బుధవారం 28 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 28 May 2025 | Rs

68 మంది ప్రముఖులకు 'పద్మ' పురస్కారాల ప్రదానం

7



పిరికి చర్యలకు భయపడేది లేదు!

జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా

పహల్గాంలో మంత్రివర్గ సమావేశం



మంత్రివర్గ సమావేశంలో జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా

పహల్గాం : ఐదు వారాల క్రితం ఉగ్రదాడితో వణికిన పహల్గాంలో రాష్ట్ర కేబినెట్ సమావేశాన్ని నిర్వహించడం ద్వారా పిరికిపంద చర్యలకు భయపడేది లేదనే స్పష్టమైన సందేశాన్ని పంపినట్లు జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. పర్యాటకాన్ని సంఘర్షణలకు అతీతమైన కార్యకలాపాలుగా పరిగణించాలని, రాజకీయ సాధనంగా కాదని వ్యాఖ్యానించారు. "పర్యాటకం అనేది ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించినది. జీవనోపాధికి మార్గం. ప్రతీసారీ జమ్మూ కాశ్మీర్ పర్యాటక రంగం రాజకీయాలకు బలవుతునే వస్తోంది. ఈ పరిస్థితి నుండి పర్యాటక రంగాన్ని తప్పించాలన్నదే మా ప్రభుత్వ అభిమతం. ఇతర అంశాలతో సంబంధం లేకుండా పర్యాటక రంగాన్ని జీవనోపాధి మార్గంగానే అందరూ చూడాలి." అని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. తన అధ్యక్షతన మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ పాలక బిజెపితో సహా రాజకీయ పార్టీలనుద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకం పెరుగుతోందంటే అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొన్నాయనే సంకేతాలంటూ బిజెపి ఆ రెండింటికి మధ్య సంబంధాన్ని అంటగడుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో సాధారణ స్థితి నెలకొందని చెప్పడానికి ఇతర ప్రామాణికాలు వుంటాయని, పర్యాటకాన్ని దేనితోనూ ముడి పెట్టరాదన్నది తన అనుభవమని అబ్దుల్లా స్పష్టం చేశారు.

"పహల్గాంలో కేబినెట్ సమావేశం ఏర్పాటు చేయడమంటే ఇదేదో రొటీన్‌గా జరిగే పాలనా వ్యవహారం కాదు, ఇదొక స్పష్టమైన సందేశం. ఇలాంటి పిరికితనంతో కూడిన ఉగ్రవాద చర్యలేవీ మమ్మల్ని అడ్డగించలేవు. శాంతికి శత్రువులైన వారు మన సంకల్పాలను ఎన్నటికీ నిర్దేశించలేరు. జమ్ము కాశ్మీర్ దృఢంగా, బలంగా, నిర్భయంగా నిలబడుతుంది." అని అబ్దుల్లా స్పష్టం చేశారు. స్థానికుల్లో విశ్వాసం నింపడానికి, వారికి సంఘీభావంగా నిలబడేందుకే తాము ఇక్కడకు వచ్చామన్నారు.

గత ఐదారువారాలు దేశానికి అంత సులభమైన పరిస్థితులేమీ కాదని, జమ్మూ కాశ్మీర్ అన్నింటికంటే ఎక్కువగా ఇబ్బందులు పడుతోందని చెప్పారు. ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని, కేంద్రం మద్దతు కూడా అవసరమవుతుందని తెలిపారు. బైసరన్ దాడి తర్వాత, కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా పహల్గాం పార్కుల్లో భద్రతా ఆడిట్‌లు అవసరమని నిర్ణయించారు. నెమ్మదిగా అవి ప్రారంభమవుతాయని, తాను కూడా అలాగే జరగాలని భావించానని చెప్పారు. కాశ్మీర్‌లోని 48 పర్యాటక ప్రాంతాల్లోకి ఇప్పటికీ ప్రజలను ఎందుకు అనుమతించడం లేదో చెప్పాలని ముఖ్యమంత్రి భద్రతా సంస్థలను ప్రశ్నించారు. పర్యాటకానికి అవసరమైన వాతావరణాన్ని మిగతా 2లో





మహానాడుకు హాజరైన కార్యకర్తలు, అభివాదం చేస్తున్న చంద్రబాబునాయుడు

గర్వపడేలా పాలన

సూపర్‌సిక్స్‌తో పాటు, మ్యానిఫెస్టోలోని హామీలన్నీ నెరవేరుస్తాం


- మహానాడులో చంద్రబాబు
- అట్టహాసంగా ప్రారంభం

మహానాడు ప్రాంగణం నుంచి ఎం శివాజి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గర్వపడేలా పరిపాలన సాగిస్తామని టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం కడపలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు తెలుగురాష్ట్రాల నుండి వచ్చిన టిడిపి కార్యకర్తలతో మహానాడు ప్రాంగణం పసుపుమయంగా మారింది. ప్రాంగణలో ఏర్పాటు చేసిన చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి ప్రతినిధుల కేంద్రంలో చంద్రబాబు తన పేరును తొలుత నమోదు చేసుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళలర్పించి టిడిపి జెండాను ఆవిష్కరించారు. వేదికపైన తొలుత 'మా తెలుగుతల్లికి' గీతాలాపన చేశారు. మృతి చెందిన టిడిపి నేతలకు, కార్యకర్తలకు సంతాపం ప్రకటించారు. అనంతరం మహానాడుకు వచ్చిన ప్రతినిధుల హర్ష ధ్వానాల మధ్య టిడిపి అధ్యక్షుని హోదాలో ప్రసంగాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలు పోరాటం వల్లనే తిరిగి అధికారంలోకి రాగలిగామని చెప్పారు. 'మన పసుపు .. చంద్రయ్యను పీకకోస్తున్నా జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలాడు. ఆయనే మనకు స్ఫూర్తి, ఆ స్ఫూర్తే ముందుకు నడిపిస్తుంది' మిగతా 2లో

రాత్రికి రాత్రే ఇళ్ల కూల్చివేత

- 7 బుల్డోజర్లతో 300 మంది గూండాల స్వైరవిహారం
- కరెంట్ కట్ చేసి, ఫోన్లు పగలగొట్టి కాలనీ నేలమట్టం చేసిన వైనం
- బాధితులకు సిపిఎం నాయకుల పరామర్శ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర నేత వైవి, జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

తిరుపతి శివారు ప్రాంతమైన మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలోని వేణుగోపాల్ కాలనీని గూండాలు రాత్రికి రాత్రి కూల్చివేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఏడు బుల్డోజర్లతో 300 మంది గూండాలు వచ్చారు. ఈ ప్రాంతంలో కరెంట్ కట్ చేసేశారు. దౌర్జన్యంగా ఇళ్లలోకి చొరబడ్డారు. సమాచారం బయటకు చేరకుండా ఉండేందుకు కాలనీలోని వారి సెల్‌ఫోన్లను లాక్కొని ధ్వంసం చేసేశారు. ఇళ్లల్లోని వృద్ధులు, పిల్లలతో సహా అందరినీ బలవంతంగా బయటకు ఈడ్చేశారు. ఇళ్లలోని వస్తువులను ధ్వంసం చేశారు. బుల్‌డోజర్లతో ఇళ్లను నేలమట్టం చేసేశారు. పోలీసులు అడ్డుకున్నా విధ్వంస కార్యక్రమాన్ని కొనసాగించారు. ఇళ్లలోని బంగారం, డబ్బుతో సహా విలువైన సామగ్రిని ట్రాక్టర్లో వేసుకుని తరలించుకోపోయారు. బాధితులంతా మొండిగోడల మధ్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వీరంతా పేద, మధ్యతరగతికి చెందిన వారే. తమ పేర్లతో ఇళ్లు పక్కాగా రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయని, పంచాయతీకి పన్ను కడుతున్నామని, కరెంట్ మీటర్లు తమ పేరుతోనే ఉన్నాయని, ఇంటి నిర్మాణానికి బ్యాంకులు రుణాలు ఇచ్చారని బాధితులు తెలిపారు. బాధితులను సిపిఎం నాయకులు పరామర్శించారు. ఇళ్లు కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలని కోరారు.

2016-2018 మధ్య మంగళం చెన్నాయగుంట సర్వే నెంబర్ 211/2, 218/1లో ఈ కాలనీని ఏర్పాటు చేసి మిగతా 2లో

నారాయణపూర్‌లో హైడ్రామా

- దహన సంస్కారాలకు అంగీకరించినట్లు అర్జీ తయారు చేసిన పోలీసులు
- కేశవరావు సోదరుడితో బలవంతంగా సంతకాలు చేయించేందుకు యత్నం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహానికి దహన సంస్కారాలు చేసిన తర్వాత నారాయణ్ పూర్‌లో హైడ్రామా నడిచింది. కేశవరావు చితాభస్మమైనా, అస్తికలైనా ఇవ్వాలని పోలీసులను అడిగేందుకు ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం నారాయణ్‌పూర్ ఎస్‌పి కార్యాలయానికి వెళ్లారు. వారిని రెండు గంటల పాటు అక్కడే ఉంచిన తర్వాత మిగతా 7లో

'ఉక్కు' సమ్మె ఉధృతం

- వేలాది మందితో స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి
- పోలీసుల జోక్యంతో ఉద్రిక్తత

3

చెదురుమదురుగా భారీ వర్షాలు 7

ఆపరేషన్ సిందూర్‌పై పోస్ట్ పెడితే...

క్రిమినల్‌లా చూస్తారా? 7

- మహారాష్ట్ర ప్రభుత్వంపై బాంబే హైకోర్టు ఆగ్రహం

ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా ఎదుర్కోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- విజయవాడలో సమైక్యతా యాత్ర



సమైక్యతా యాత్రలో వి శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదాలను కలిసికట్టుగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం, మతసామరస్యాన్ని కాపాడుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. దేశ సమగ్రత పరిరక్షణకు సిపిఎం చేపట్టిన సమైక్యతా యాత్ర మంగళవారం విజయవాడలో లెనిన్ సెంటర్ నుండి బయలుదేరి అలంకార్, ఏలూరు రోడ్డు, మ్యూజియం రోడ్డు, కలెక్టరేట్, బందరురోడ్డు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకూ సాగింది. ప్రదర్శనలో సమైక్యతకు చిహ్నంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ మతపెద్దలు పాల్గొన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్దయెత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తోందని, పర్యవసానంగా ఇటీవల కాలంలో ముస్లిములపై 112 దాడులు జరిగాయని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సమయంలో మతాలకు అతీతంగా అందరూ కలిసి బాధితులకు సాయం చేశారని, అటువంటి వారికి అభినందనలు తెలపాల్సిన ప్రధాని, తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించామని చెబుతున్నారని, గతంలో సర్జికల్ స్ట్రైక్ పేరుతోనూ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారని, మరి ఇప్పటి ఉగ్రవాదులు ఎక్కడ నుండి వచ్చారని ప్రశ్నించారు. అత్యంత సున్నిత ప్రాంతమైన పహల్గాంలోకి ఉగ్రవాదులు ఎలా చొరబడ్డారో కేంద్రం ఇప్పటి వరకూ బయటపెట్టలేదన్నారు. వారిని పట్టుకోలేదని, పైగా ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసిన సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరిగా బిజెపి నాయకులు వర్ణించడం అత్యంత సిగ్గుచేటైన విషయమన్నారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు మోడీ సోఫియా కుటుంబ సభ్యులతో ప్రదర్శన జరిపి రాజకీయం చేశారని అన్నారు. బిజెపికి మద్దతు ఇస్తున్న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్.. ముస్లిములు పాకిస్తాన్ వెళ్లిపోవాలని ముస్లిం వ్యతిరేకతను మిగతా 7లో

'నా తెలుగు కుటుంబం...'

టిడిపికి ఆరు కొత్త సిద్ధాంతాలు ప్రతిపాదించిన లోకేష్

కొత్త శక్తి ఇస్తాయన్న ప్రతినిధులు

ప్రజాశక్తి-ప్రత్యేక ప్రతినిధి (మహానాడు ప్రాంగణం కడప)

'నా తెలుగు కుటుంబం...' పేరుతో ఆరు కొత్త సిద్ధాంతాల ప్రతిపాదనలను టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మహానాడులో మంగళవారం ప్రవేశపెట్టారు. తెలుగు జాతి విశ్వ ఖ్యాతి, పేదల సేవలో సోషల్ ఇంజనీరింగ్, స్త్రీ శక్తి, అన్నదాతకు అండగా, యువగళం, కార్యకర్తే అధినేత అనే అంశాలను పార్టీ సిద్ధాంతాలుగా స్వీకరించాలని ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ కూడా అడుగులు వేయాలని, సమకాలీన సమాజంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు చర్చ జరగాలని చెప్పారు. మార్పు అనేది శాశ్వతంగా ఉంటుందని టిడిపి నమ్ముతోందని తెలిపారు. పార్టీని మరో 40 ఏళ్లపాటు నడిపించడానికి అవసరమైన కీలక నిర్ణయాలపై చర్చించాలని కోరారు. అనంతరం దీనిపై మాట్లాడిన పలువురు ప్రతినిధులు లోకేష్ ప్రతిపాదించిన అంశాలు టిడిపికి కొత శక్తిని ఇస్తాయని, పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తాయని చెప్పారు.



లోకేష్ ప్రతిపాదించిన అంశాలు

అంశం	వివరణ
1. తెలుగుజాతి విశ్వఖ్యాతి	ప్రపంచంలోనే మొదటి స్థానంలో తెలుగువారు
2. యువగళం	యువతకు పెద్దపీట
3. స్త్రీశక్తి	మహిళలకు సమాన హక్కులు, సాధికారత, భద్రత
4. పేదల సేవలో– సోషల్ ఇంజనీరింగ్	అన్ని కుటుంబాలకు సమన్యాయం
5. అన్నదాతకు అండగా..	రైతులకు చేయూతనివ్వడం
6. కార్యకర్తే అధినేత	కార్యకర్తలను ఆదుకునేందుకు, వారు సొంత కాళ్లపై నిలబడేలా చూసేందుకు, 'కార్యకర్తే అధినేత' నినాదం



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చంద్రబాబు నాయుడు



ఈ సారి కడప కూడా మాదే అంటూ..

విజనరీ లీడర్

బాబుపై ముఖ్య నేతల పొగడ్తలు

మహానాడు ప్రాంగణం నుంచి షఫీవుల్లా

చంద్రబాబునాయుడిని విజనరీ నాయకుడంటూ మహానాడులో టిడిపి నేతలు పొగడ్తలతో ముంచెత్తారు. మంగళవారంఉదయం జరిగిన సెషన్‌కు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమన్వయకర్తగా వ్యవహరించగా, మధ్యాహ్నం జరిగిన కార్యక్రమానికి విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం జరిగి 43 సంవత్సరాలు పూర్తయి 44 సంవత్సరాలవుతోందన్నారు. ఇంతకాలంగా పార్టీకి వెన్నుదన్నుగా నిలిచింది పార్టీ కార్యకర్తలేనన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తోందన్నారు. 30 ఏళ్ల క్రితమే ఆయన డ్రిప్ స్ప్రింకర్ల విధానాన్ని అమలు జరిపారని ఉదహరించారు. అదే విధంగా ఐటి గురించి కూడా తెలియజేసారని చెప్పారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో టిడిపి నాయకులపై వైసిపి అనేక రకాలుగా దౌర్జన్యాలు చేసిందని విమర్శించారు. అధినాయకుడినే జైల్లో పెట్టి టిడిపిని దెబ్బతీసే ప్రయత్నం చేసిందని దుయ్యబట్టారు. పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అంటే దేశంలోనే కాదు...ఇతర దేశాల్లోనూ ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో అనేక అవమానాలు బాధలు అనుభవించామని చెప్పారు. కుటుంబ సభ్యులను కూడా వదలకుండా ఇబ్బందులు పెట్టారని తెలిపారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది లక్ష్యంగా లోకేశ్ పెట్టుకున్నారని గుర్తుచేశారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా అన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపిని బంగాళాఖాతంలో కలిపేశారని చెప్పారు. ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధా మాట్లాడుతూ ఎన్టీ రామారావు బిసి లకు ప్రాధాన్యతనిచ్చి మొక్కను నాటారాని పేర్కొన్నారు. గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ మహిళలకు 9 శాతమున్న రిజర్వేషన్‌ను 33 శాతానికి చంద్రబాబు నాయుడు తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.



ఎన్‌టిఆర్ వేషధారణలో....

15 రోజుల్లో కడప ఉక్కు పనులు

- భూములతోనే పరిశ్రమలను ఆకర్షిస్తాం
- 'సీమ' అభివృద్ధి కోసం ప్రత్యేక పాలసీ
- పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చేస్తా
- మీడియాతో నారా లోకేష్

ప్రజాశక్తి–ప్రత్యేక ప్రతినిధి(మహానాడు ప్రాంగణం)

కడప ఉక్కు పరిశ్రమ పనులు 15 రోజుల్లో ప్రారంభం కానున్నాయని టిడిపి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తెలిపారు. మహానాడు ప్రాంగణం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని చెప్పారు. భూములతోనే రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షిస్తామని చెప్పారు. 'మా వద్ద ఉన్న పరికరం (టూల్) భూములే... వాటిని చూపించే పరిశ్రమలను తీసుకువస్తాం' అని అన్నారు. ఉర్సా సంస్థకు మార్కెట్ ధర ప్రకారమే భూములు కేటాయించామని చెప్పారు. 99పైసలకే ఇచ్చినట్లు నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని అన్నారు. రానున్న ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాయలసీమ అభివృద్ధి కోసం ప్రత్యేక పాలసీ తీసుకొస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమం ఎంపికకు అవకాశం ఇస్తామని చెప్పామని, ఇంగ్లీష్ మాధ్యమం తీసేస్తానని చెప్పలేదన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో ప్రవేశ పెడుతున్న మోడల్ ప్రైమరీ పాఠశాలలకు తరగతుల కొరత ఉన్న విషయం వాస్తవమేనన్నారు. పిల్లల సంఖ్యను బట్టి తరగతులు ఏర్పాటు చేస్తామని, అప్పటివరకు కొంతఇబ్బంది తప్పదన్నారు. విద్యాశాఖలో సంస్కరణల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. డిఎస్సి భర్తీ ప్రక్రియ ముగిసిన తరువాత ఉన్నత విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. జూన్ చివరి నాటికి నామినేటెడ్ పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామన్నారు. 2019లో కార్యకర్తలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఓటమి చెందామని, ఈసారి పార్టీని ప్రభుత్వాన్ని బాలెన్స్ చేస్తామన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చేస్తానని తెలిపారు.



టిడిపి జెండాను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

కార్యకర్తలే టిడిపికి బలం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి–ప్రత్యేక ప్రతినిధి (మహానాడు ప్రాంగణం కడప

సామాన్య కార్యకర్తలే టిడిపికి బలం అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో మంగళవారం ఉదయం ఆయన స్వాగతోపన్యాసం చేశారు. తెలుగు వాడి ఆత్మగౌరవ నినాదంతో టిడిపి ఆవిర్భవించిందని పేర్కొన్నారు. పార్టీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అనేక ఆటంకాలు, అవరోధాలను అధిగమించి 40 సంవత్సరాలకుగాపై ముందుకుపోతూనే ఉందన్నారు. గత ప్రభుత్వ హయంలో టిడిపి నేతలను అప్పటి ప్రభుత్వం అనేక రకాలైన ఇబ్బందులు పెట్టినా భయపడకుండా ఎదురొడ్డి పోరాడారాని చెప్పారు.

ఐదేళ్లల్లో గడ్డు పరిస్థితి: నివేదికలో టిడిపి ప్రధాన కార్యదర్శి

గడిచిన ఐదేళ్లల్లో గడ్డు పరిస్థితి ఎదుర్కొందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య అన్నారు. ప్రధాన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టి ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను ఆయన వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు అధినేత కూడా జైళుకెళ్లాల్సి వచ్చిందన్నారు.

క్యూబ్స్‌కు చట్టబద్ధత

తిరుపతిలో మహానాడులో తీసుకొచ్చిన క్లస్టర్, యూనిట్, బూత్, కుటుంబ సాధికార సారధి(క్యూబ్స్)విధానానికి చట్టబద్ధత కల్పించే విధంగా పార్టీ నియమావళిలో మార్పులు తీసుకొచ్చే తీర్మానాన్ని పార్టీ కార్యాలయ కార్యదర్శి పి అశోక్ బాబు ప్రవేశపెట్టారు. క్షేత్రస్థాయిలో ఉన్న క్యూబ్స్ విధానాన్ని పార్టీ నియమావళిలో చేర్చి చట్టబద్ధత చేయాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

అధికారిక వేడుకగా ఎన్‌టిఆర్ జయంతి

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ జయంతిని ప్రతియేటా మే 28న అధికారిక వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్‌టిఆర్ తెలుగు జాతికి విశేషమైన సేవలు అందించారని, సామాజిక న్యాయం, వికేంద్రీకరణ, సంక్షేమం, పాలనా సంస్కరణలను ప్రవేశపెట్టారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అన్ని ప్రభుత్వ శాఖల విభాగాధిపతులు, జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గల్లంతైన ఏడుగురి మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి – ముమ్మిడివరం (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని గ్రామంలో గోదావరిలో ఎనిమిది మంది యువకులు గల్లంతైన ఘటనలో మంగళవారం ఏడుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో యువకుడి కోసం గాలింపు కొనసాగుతోంది. పోలీసు, రెవెన్యూ, ఫైర్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృంధాలు చేపట్టిన గాలింపులో మంగళవారం సాయంత్రం నాటికి కాకినాడకు చెందిన సబ్బతి పాల్ అభిషేక్ (18), జి.మూలపాలెంకు వడ్డి మహేష్ (15), శేరుల్లంకకు చెందిన ఎలిపే బాబు అలియాస్ మహేష్ (15), తూరంగికి చెందిన యలమర్తి సాయి మహేష్ (20), మండపేటకు చెందిన పులపాక మహేశ్వర వీర వెంకట రోహిత్(19), యర్రగురువుకు చెందిన వడ్డి రాజేష్(14), తాతపూడి నితీష్ (18) మృతదేహాలు లభ్యమయ్యాయి. కాకినాడకు చెందిన సబ్బతి క్రాంతి కోసం విస్తతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతదేహాలను ముమ్మిడివరం కమ్యూనిటీ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. గాలింపు చర్యల్లో ఎఎస్‌పి ప్రసాద్, డిఎస్‌పిలు బి.రఘువీర్, పిఎస్‌ఆర్‌కె ప్రసాద్, ఆర్‌డిఒలు కె.మాధవి, డి.అఖిల పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారిగా వసంత

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమశాఖలో బి వసంతను విజిలెన్స్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ చీఫ్ ఇంజినీరుగా పనిచేస్తున్న వసంతను విజిలెన్స్ అధికారిగా నియమిస్తున్నట్లు, ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజిలెన్స్‌లోని విభాగాలు ఆమె నియంత్రణలోకి వస్తాయని తెలిపారు.



వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు

వైఎస్ఆర్ విగ్రహానికి టిడిపి జెండాలు

- వైసిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి – కడప

కడప నగరంలో మహానాడు సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి తెలుగుదేశం పార్టీ తోరణాలు, జెండాలు కట్టారు. దీనిని నిరసిస్తూ నగరంలోని పోస్టాఫీసు వద్దనున్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి శ్రేణులు పాలభిషేకం చేశారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, కడప నగర మేయర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ.. మహానాడు పేరుతో వైఎస్ఆర్ విగ్రహంతో పాటు మహనీయుల విగ్రహాలకు పసుపు జెండాలు కట్టడం సరికాదన్నారు. నగరంలోని అన్ని వైఎస్ఆర్ విగ్రహాలతో పాటు అంబేద్కర్, గాంధీజీ వంటి మహనీయుల విగ్రహాలకు కట్టిన పసుపు తోరణాలు తొలగించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి సంస్కృతి లేదని, కవ్వింపు చర్యలకు దిగడం సరికాదన్నారు.

పిరికి చర్యలకు భయపడేది లేదు!

మొదటి పేజీ తరువాయి

నెలకొల్పాలంటే జమ్మూ కాశ్మీర్‌కు ఎన్నికైన ప్రభుత్వం, ఎన్నికవని ప్రభుత్వం, కేంద్రం తోడ్పాటు అవసరమని అబ్దుల్లా పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో సెక్యూరిటీ సంస్థల ఇన్‌ఛార్జిగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వున్నారు. కాశ్మీర్‌లో పర్యాటక రంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి చేపట్టాల్సిన చర్యల గురించి ప్రధాని ఇప్పటికే రెండు సమావేశాల్లో చర్చించారన్నారు.

గోల్ఫ్ ఆడిన ఫరూక్ అబ్దుల్లా

పాలక నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) నేత డాక్టర్ ఫరూక్ అబ్దుల్లా పహల్గాంలో గోల్ఫ్ ఆడుతూ కనిపించారు. "ఇటీవల ఇక్కడ జరిగిన దాడి విశ్వాసాన్ని దెబ్బతీసింది. నెమ్మదిగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. భయం తగ్గుతోంది. గుల్మార్గ్ నుండి ఇప్పుడే వచ్చాను, అక్కడ నాలుగైదు వందల మంది పర్యాటకులు వున్నారు. పహల్గాంలో కూడా పరిస్థితులు చక్కబడుతున్నాయి." అని అబ్దుల్లా వ్యాఖ్యానించారు.

రాత్రికి రాత్రే ఇళ్ల కూల్చివేత

మొదటి పేజీ తరువాయి

ప్లాట్లు వేసి శ్రీనివాసులురెడ్డి, రుద్రగోపి అనే వారు తమకు విక్రయించారని బాధితులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ స్థలంపై హైకోర్టు, ఆర్‌డిఒ కోర్టు, జిల్లా కోర్టులలో కేసులు నడుస్తున్నాయని ఈ స్థలాలు విక్రయించిన రుద్రగోపి మీడియాకు తెలిపారు. ఈ కేసులను వెనక్కి తీసుకోవాలని నిర్మల, రాజన్ బాబు, మునిరెడ్డి అనే కొంతమంది గత మూడు నెలలుగా తనను ఒత్తిడి చేస్తున్నారని, ఈ క్రమంలోనే ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు.

కూల్చివేత వెనుక బలమైన శక్తులు

ఇళ్లను పక్కా ప్రణాళికతో కూల్చివేశారని, దీనివెనుక బలమైన శక్తులు ఉండి ఉంటాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాదితులను ఆయన, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పరామర్శించి వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధితులకు అండగా సిపిఎం ఉంటుందని, వారికి మద్దతు ఇచ్చేవారితో కలిసి ఉద్యమిస్తామని తెలిపారు. బుల్డోజర్ సంస్కృతి రాష్ట్రంలో కూడా ప్రవేశించిందన్నారు. ఈ ఘటనపై పోలీసు, రెవెన్యూ అధికారులు సంప్రదించి బాధితులకు న్యాయం చేయాలని, కూల్చిన ఇళ్లను తిరిగి నిర్మించాలని, వారికి రక్షణ కల్పించాలని కోరారు. దౌర్జన్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం చెల్లదు : హైకోర్టు

ప్రజాశక్తి–అమరావతి

భూమికి సంబంధించిన సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం చేసుకోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తుల మధ్య భూ వివాదాలను పరిష్కరించేందుకు సివిల్ కోర్టులు ఉన్నాయంది. పోలీసులు ప్రీ లిటిగేషన్ కౌన్సిల్ ఫోరం (పిఎల్‌సిఎఫ్) పేరుతో సివిల్ వివాదాల్ని డీల్ చేయడం చెల్లదంది. ఇలాంటి వాటిని ఏర్పాటుచేయడం వల్ల కక్షిదారుల్లో భయాందోళనలు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఆదేశాలు జారీ చేశారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్ తనను పదేపదే పిలిపిస్తూ వేధిస్తున్నారని, పోలీసులు సివిల్ వివాదంలో జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులివ్వాలంటూ ఎస్ శ్యామల అనే 74 ఏళ్ల వృద్ధురాలు పిటిషన్ దాఖలు చేశారు. అడ్వకేట్ వట్టికూటి సూర్యానారాయణ వాదిస్తూ, వెంకట సత్య నాగ కృష్ణంరాజు, గోపాలరాజు, వెంకట సత్యనారాయణ రాజుతో పిటిషనర్‌కు సివిల్ వివాదం పెండింగ్‌లో ఉందని, పోలీసులు ప్రీ లిటిగేషన్ కౌన్సిలింగ్ ఫోరం పేరుతో సివిల్ వివాదం పరిష్కరం చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ప్రీ లిటిగేషన్ కౌన్సిలింగ్ ఫోరం పేరుతో వివాద పరిష్కారానికి పార్టీలను కౌన్సిలింగ్‌కు రావాలని కోరామని, పిటిషనర్ రాకపోవడంతో వదిలేశామని పోలీసుల తరపున న్యాయవాది చెప్పారు.

దీనిపై న్యాయమూర్తి, ప్రీ లిటిగేషన్ కౌన్సిల్ ఫోరం పేరుతో సివిల్ వివాదాలను పరిష్కరించడానికి వీల్లేదని పోలీసులకు ఆదేశాలిచ్చారు. ప్రకాశం జిల్లా, ముండ్లమూరు పోలీసులు ఓ సివిల్ వివాదంలో జోక్యం చేసుకోవడాన్ని కూడా న్యాయమూర్తి తప్పుపట్టారు. కేసు ఉపసంహరించుకోవాలని పిటిషనర్‌కు ఒత్తిడి చేయొద్దని పోలీసులను ఆదేశించారు. నర్సరావుపేట పోలీసులకు కూడా అదే తరహా ఉత్తర్వులు జారీ చేశారు.

'శక్తి వాట్సాప్' : డిజిపి

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ఆపదలో ఉన్న మహిళలను శక్తి టీమ్స్ సత్వరమే స్పందించి ఆదుకుంటున్నాయని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. సాంకేతిక సహాయంతో మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలకు చెక్ పెడుతున్నట్లు తెలిపారు. డిజిపి కార్యాలయంలో మంగళవారం 'ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్' శక్తి వాట్సాప్ నెంబరు 7993485111ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. ఆపదలో మహిళలు శక్తి వాట్సాప్ నెంబరుకు కాల్ (వీడియో నార్మల్ కాల్), మెసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సంకేతాలు వెళ్లిన వెంటనే శక్తి టీమ్స్ సత్వరమే స్పందించి వారిని ఆదుకుంటుందన్నారు. 'ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఐజిపి బి రాజకుమారి మాట్లాడుతూ.. శక్తి వాట్సాప్ నెంబరును మహిళలు విధిగా మొబైల్స్‌లో సేవ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి శ్రీదేవిరావు పాల్గొన్నారు.

గర్వపడేలా పాలన

మొదటి పేజీ తరువాయి

అని అన్నారు. 'టిడిపి పనైపోయిందని చాలా మంది మాట్లాడారు. వారి పనే అయిపోయింది.' అని అన్నారు. గత ప్రభుత్వం పాలనంటే హత్యారాజకీయలుగా, కక్ష సాధింపు చర్యలుగా మార్చి వేసిందని చెప్పారు. కానీ, తమ ప్రభుత్వం అలా ఉండదని కార్యకర్తలు గర్వించేలా పాలన చేసి, అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. కడపలో జరుగుతున్న మహానాడు చరిత్ర సృష్టించబోతోందని అన్నారు. రానున్న రోజుల్లో పార్టీకి, ప్రభుత్వానికి మధ్య అనుసంధానాన్ని మరింతగా పెంచుతామని తెలిపారు. రాష్ట్రప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలతో పాటు, మానిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని అమలు చేస్తామని అన్నారు. ఎన్నికలు ముగిసినాటికి వారసత్వంగా రూ.10లక్షల కోట్ల అప్పు వచ్చిందని, ఇబ్బందులు ఎన్ని వచ్చినా హామీలను నిలబెట్టుకుంటామని చెప్పారు. పాఠశాలలు ప్రారంభించే ముందే తల్లికి వందనం అమలు చేస్తామని పునరుద్ఘటించారు. అన్నదాత సుఖీభవను కేంద్రం ఇచ్చే రూ.6వేలతో కలుపుకుని విడతాల వారీగా రూ.20 అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి తీసుకువస్తామన్నారు. సంపద సృష్టించి ఆదాయం పెంచాలని, సంక్షేమం, అభివృద్ధికి ఈ ఆదాయం ఖర్చు చేయాలని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన 78 ఏళ్లలో జరిగిన అభివృద్ధి రానున్న 22 ఏళ్లల్లో జరుగుతుందన్నారు. . పి4 ద్వారా ఆర్థిక అసమానతాలు తగ్గిస్తామని, 2047 నాటికి జీరో పావర్టీ సాధిస్తామన్నారు. రాబోయే పదేళ్లల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తామన్నారు. ప్రభుత్వ సర్వీసులపై కూడా సర్వే చేయిస్తామని, ప్రజల అభీష్టం మేరకు పని చేయిస్తామన్నారు. ఉత్తరాంధ్రపై ప్రత్యేక దృష్టి, అమరావతి పూర్తిచేస్తామని తెలిపారు. పోలవరం పూర్తిచేస్తునే బనకచర్ల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామన్నారు.రాయలసీమలో హంద్రీనీవాను ఈ ఏడాదే పూర్తిచేసి చివరి భూములకు నీళ్ల అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.

. ఆలస్యమైనా శిక్ష తప్పదు

తప్పు చేసిన వారికి ఆలస్యమైనా శిక్ష తప్పదని అన్నారు. గతంలో ప్రభుత్వాలు చేసిన అవినీతి ఒక ఎత్తు అయితే వైసిపి ప్రభుత్వం అక్రమాలు మరో ఎత్తు అని విమర్శించారు. ఎన్నికల్లో అవినీతి పాలకులను తరిమికొట్టి తమకు అధికారం ఇచ్చారని చెప్పారు. అక్రమార్కులను శిక్షించే బాధ్యతను చట్టబద్ధంగా నెరవేరుద్దామని చెప్పారు. ప్రజాసంపద దోచినవారిని, గాడితప్పిన నాయకులు, అధికారులను క్షమించే ప్రసక్తే లేదన్నారు.

ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు చర్యలు

- యాజమాన్యానికి సిఎం చంద్రబాబు సూచన

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంస్థ యాజమాన్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఉక్కు పరిశ్రమ సిఎండి (అదనపు చార్జి) ఎ.కె సక్సేనా కడపలో సిఎం చంద్రబాబును మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పరిశ్రమను పూర్తి సామర్థ్యంతో నడిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రానున్న రోజుల్లో ఉక్కు పరిశ్రమ మెరుగైన ఫలితాలు సాధించేందుకు సంస్థ యాజమాన్యం తీసుకునే అన్ని చర్యలకు రాష్ట్ర ప్రభుత్వ మద్ధతు ఉంటుందని సిఎం తెలిపారు. ప్లాంట్ ఉద్యోగులు, యాజమాన్యం సమన్వయంతో పని చేయాలని సూచించారు. పరిశ్రమ కోసం కేంద్రం రూ.11,440 కోట్లు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో రూ.2,660 కోట్లు మేర సాయం అందించిందన్నారు. కొందరు ప్లాంట్‌ను బలహీన పరిచేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. నష్టాల బాట పట్టించేందుకు ఎవరూ ప్రయత్నించినా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజా ప్రతినిధులకు విలువివ్వండి

- ఐఎఎస్‌లకు ప్రభుత్వం హితవు
- కీలక మార్గదర్శకాలు జారీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మధ్య పెరుగుతున్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. తమను కనీసం పట్టించుకోవడం లేదని అనేక మంది ప్రజా ప్రతినిధులు.. ఐఎఎస్ అధికారుల తీరుపై గుర్రుగా ఉన్న నేపథ్యంలో సాధారణ పరిపాలనశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. తమను ఐఎఎస్ అధికారులు కనీస స్థాయిలో కూడా పట్టించుకోవడం లేదంటూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుని దృష్టికి ప్రజా ప్రతినిధులు తీసుకెళ్లడంతో ఆయన కూడా జిఎడి అధికారులతో చర్చించారు. ఈ తరుణంలోనే జిఎడి స్పందించి అవసరమైన ప్రొటోకాల్ చర్యలు తీసుకోవాలని ఐఎఎస్‌లకు సూచనలు జారీ చేసింది. ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి వస్తున్న ఫిర్యాదులు నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం సాధారణ పరిపాలనశాఖ కూడా అన్ని శాఖల అధికారులకు కీలక మార్గదర్శకాలు విడుదల చేసింది.

పార్లమెంట్ సభ్యులు, శాసనసభ, శాసనమండలి సభ్యుల నుంచి వచ్చే ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, వారి నుంచి వచ్చే ప్రతిపాదనలు, లేఖలను కూడా పరిశీలించాలని, వారి నుంచి వచ్చే ఫోన్‌లకు కూడా స్పందించాలని నిర్దేశిస్తూ జిఎడి స్పష్టమైన సూచనలు ఇవ్వడం గమనార్హం. వివిధ కార్యక్రమాల నిర్వహణ సమయంలో కూడా వారికి సముచిత ప్రాధాన్యత, సీట్ల కేటాయింపులు ఉండాలని, విమానాశ్రయాల్లో ప్రొటోకాల్ ఏర్పాట్లు కూడా చూడాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రముఖుల పర్యటనల్లో కూడా ప్రాధాన్యత ఉండేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేరుతో జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

ప్రాణం నిలిపే వైద్యం అందడం లేదు

- బెయిల్ ఇవ్వండి
- వల్లభనేని వంశీ పిటిషన్

ప్రజాశక్తి–అమరావతి

బాపులపాడు మండల పరిధిలో నకిలీ నివాస పట్టాలు మంజూరు చేశారంటూ హనుమాన్ జంక్షన్ పోలీసులు పెట్టిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'ఆరోగ్యం బాగా దెబ్బతింది. బెయిల్ మంజూరు చేయాలి. వ్యక్తిగత వైద్యుల సూచనకు అనుగుణంగా ఆస్పత్రికి తరలించేలా జైలు అధికారులకు ఉత్తర్వులివ్వాలి. పోలీసులు దురుద్దేశపూర్వకంగా, కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. సరైన వైద్య సాయం అందకుండా చేస్తున్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలున్నాయి. ప్రాణాలకు ముప్పు ఉంది. చికిత్స అందించేంత సదుపాయాలు జైలుల్లో లేవు. ప్రాణాలను నిలబెట్టే వైద్యం అందేలా చేయాలి. కేసు దర్యాప్తునకు సహకరిస్తాను' అని దాఖలు చేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌ను గురువారం విచారిస్తామని హైకోర్టు పేర్కొంది. బెయిల్ ఇచ్చేందుకు నూజివీడు కోర్టు నిరాకరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

మహానాడులో సీమ ప్రాజెక్టులపై ప్రకటన

- టి లక్ష్మీనారాయణ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిత్య కరువు పీడిత రాయలసీమలో మహానాడు జరుపుకుంటున్న తెలుగుదేశం పార్టీ సీమ ప్రాజెక్టులపై విస్పష్ట ప్రకటన చేయాలని ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక సమన్వయకర్త టి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాయలసీమలో పలు ప్రాజెక్టులు మూడున్నర దశాబ్దాలుగా నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఎన్‌టిఆర్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కృష్ణా జలాల ఆధారంగా తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా సుజల స్రవంతి, వెలిగొండ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. వాటి నిర్మాణ స్థితిగతులపై ప్రభుత్వం విడుదల చేసే శ్వేతపత్రం లాంటి విధాన ప్రకటన మహానాడులో చేయాలని కోరారు.

పద్మ అవార్డు గ్రహీతలకు జగన్ అభినందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రం నుండి పద్మ అవార్డులు అందుకున్న పలువురు ప్రముఖులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకు అవార్డులు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి భవన్లో మంగళవారం మంద కృష్ణమాదిగ, కెఎల్ కృష్ణ, వదిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి తదితరులు పద్మ అవార్డులు అందుకున్నారు.

2న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

- జపాన్‌తో కాదు.. చైనాతో పోటీ పడండి : రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సూపర్‌సిక్స్ హామీలతో పాటు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని జూన్ రెండున సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. మంగళవారం కర్నూలు సిఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాని మోడీని సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ పొగడ్తలతో ముంచెత్తుతున్నారని, అభివృద్ధిలో జపాన్‌తో పోల్చుకోవడం కాదని, ప్రపంచంలో రెండస్థానంలో ఉన్న చైనాతో పోటీ పడాలని సూచించారు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు భారత దేశం అప్పు రూ.84 లక్షల కోట్లు కాగా, ప్రస్తుతం రూ.284 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించారా? దేశంలో నిరుద్యోగం తగ్గించారా? విదేశాల్లో ఉన్న నల్లడబ్బులు తెచ్చారా? అని ప్రశ్నించారు. జమిలి ఎన్నికలపై తమిళనాడులోని డిఎంకెతో మాట్లాడతానని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పాల్గొన్నారు.

'ఉక్కు' సమ్మె ఉధృతం

- వేలాది మందితో స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి
- పోలీసుల జోక్యంతో ఉద్రిక్తత


అడ్మిన్ భవనంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె ఉధృతమైంది. రీజనల్ లేబర్ కమిషనర్ ఆఫీస్‌లో సోమవారం జరిగిన చర్చలు విఫలం కావడంతో ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడికి పిలుపునిచ్చాయి. స్పందించిన వేలాదిమంది కార్మికులు అడ్మిన్ బిల్డింగును ముట్టడించారు. దీంతో, మంగళవారం ఉదయం నుంచి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిపై ముందస్తు సమాచారం ఉన్న పోలీసులు భారీగా మోహరించి కార్మికులను లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకోవడంతో ఇరుపక్షాల మధ్య తోపులాట, తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో కొందరు యూనియన్ నాయకులు కిందపడిపోయారు. మండుటెండను సైతం ఖాతరు చేయకుండా అడ్మిన్ బిల్డింగ్ వద్ద కార్మికులు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఎనిమిది రోజులుగా కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. 20 నుంచి 30 ఏళ్లుగా పనిచేస్తున్న వేలాదిమంది కాంట్రాక్టు కార్మికులను అర్ధాంతరంగా రోడ్డున పడేస్తే ఆ కుటుంబాలు ఏం కావాలని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించి కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. తమకు ఓట్లు వేసి గెలిపించిన కార్మిక కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంటే దీన్ని ఆపాల్సిన బాధ్యత టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఈ నాయకులు కార్మికుల పక్షాన నిలవకుండా, కార్మికులకు అండగా నిలుస్తున్న కార్మిక ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలపై ప్రెస్‌మీట్‌లు పెట్టి విషం కక్కడం ఉక్కు కాంటాక్టు కార్మికులను ఒంటరి పాటు చేసి దెబ్బ తీసే కుట్రలో భాగమేనని అన్నారు. ఇప్పటికైనా వీరు ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు అనుకూలమో? కాదో? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంటాక్టు కార్మికులు చేసే పనులను ఎగ్జిక్యూటివ్‌లు, నాన్ ఎగ్జిక్యూటివ్‌లతో 12 గంటల డ్యూటీలు చేయిస్తూ, పని భారం పెంచుతూ ఉత్పత్తికి విఘాతం కలగలేదని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటిస్తోందన్నారు. కాంట్రాక్టర్లకు టెండర్లు రద్దు చేస్తామని లేఖలు పంపడం, కాంట్రాక్టర్ల ద్వారా కార్మికులను బెదిరించడం, కార్మికుల బయోమెట్రిక్ నిలిపివేయడం, వీరి స్థానంలో కొత్త వారిని నియమించడానికి కుట్రలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

కొత్త వారితో పని చేయించడానికి స్టీల్‌ప్లాంట్‌లో మట్టి తయారు చేయడం లేదని, ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన స్టీల్ ఉత్పత్తి అవుతోందని గుర్తించాలన్నారు. పాత స్కిల్డ్ కార్మికులు లేకుండా ఉత్పత్తి అసాధ్యమని, ఈ విషయం యాజమాన్యానికి తెలిసినా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో కావాలని తొలగింపులకు పూనుకొంటోందని విమర్శించారు. సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకొని భవిష్యత్తులో ఏ ఒక్కరినీ తొలగించకుండా చర్యలు చేపట్టకపోతే ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు.

కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, యు.వంశీ, యు అప్పారావు, పి.భాస్కరరావు తదితరులు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే బయట పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీ భరత్ వెంటనే జోక్యం చేసుకొని కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని, ఉపాధిని కాపాడాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకునేలా వెంటనే చర్యలు చేపట్టాలని, పోలీసు నిర్బంధాన్ని నిలిపివేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మిక కుటుంబాల జీవితాల మనుగడకే ప్రమాదం వచ్చినందున అందరూ స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం అన్ని గేట్లు వద్ద కరపత్రాలు పంచుతూ సమ్మె జయప్రదానికి కృషి చేయాలని, తొమ్మిది గంటలకు అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన కొనసాగించాలని కాంట్రాక్ట్ కార్మికులకు పిలుపునిచ్చారు.

అమరవీరుల స్మారక సభను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో అమరవీరుల స్మారకసభను పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సభను నిర్వహించొద్దని ఆదేశాలిస్తూ సభను నిలిపివేశారు. శ్రీకాకుళ సాయుధ పోరాటంలో 1969 మే 27న పంచాది కృష్ణమూర్తి, శృంగవరపు నర్సింహులు, దున్న గోపాలపారావు, బైనపల్లి పాపారావు. నిరంజన్ సాహు మృతి చెందారు. వారి త్యాగాలకు గుర్తుగా బొడ్డపాడు గ్రామంలో అమరవీరుల స్మారక మందిరాన్ని ఏర్పాటు చేశారు. నాటి అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి పోరాట పటిమను తెలియజేస్తూ.. అమరవీరుల స్మారక సభను ఏటా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా స్మారక సభ నిర్వహించేందుకు సిపిఐఎంఎల్ లిబరేషన్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ, పౌర హక్కుల సంఘం, అమరవీరుల బంధుమిత్ర సంఘం, బొడ్డపాడు యువజన సంఘాలు సిద్ధమయ్యాయి. సభ



సభను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రారంభమయ్యే సమయానికి సిఐ సూర్యనారాయణ తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని ప్రజాసంఘాల నాయకులు, నిర్వాహకులు, గ్రామస్తులతో చర్చించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సభను నిలుపుదల చేయాలని తెలిపారు. దీంతో సభను ప్రజాసంఘాలు నిలుపుదల చేశాయి.

టిడిపి కార్యాలయంపై దాడి ఘటనలో ఆళ్లపై కేసు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై సిఐడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనను 127వ నిందితుడుగా ఎఫ్ఐఆర్‌లో పేరు నమోదు చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో 2021 అక్టోబరు 19న మంగళగిరిలోని టిడిపి కార్యాలయంపై వైసిపికి చెందిన పలువురు దాడి చేసి విధ్వంసం సృష్టించారు. ఇప్పటికే ఈ కేసులో దాదాపు 44 మందిని అరెస్టు చేశారు. వారిలో 11 మంది బెయిల్ పిటిషన్లు దాఖలు చేయగా వారందరికీ షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. ఈ నేపథ్యంలో ఆళ్ల రామకృష్ణారెడ్డి గుంటూరు సిఐడి కోర్టులో ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేశారు. బెయిల్ విచారణ బుధవారం నుంచి జరగనుందని తెలిసింది. కొద్ది రోజుల క్రితం ఈ కేసులో ప్రభుత్వ మాజీ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని 120వ నిందితుడుగా పేర్కొంటూ సిఐడి పోలీసులు విచారించారు. తాజాగా ఆళ్ల రామకృష్ణారెడ్డిపైనా కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది.

పాడేరు మెడికల్ కాలేజీని పూర్తి చేయాలి

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి-విశాఖపట్నం

పాడేరు మెడికల్ కాలేజీ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, సిబ్బందిని నియమించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ఆయన మంగళవారం లేఖ రాశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో మెడికల్ కాలేజీ నిర్మాణం నత్తనడకన సాగుతోందని తెలిపారు. హాస్టల్, ఆస్పత్రి, ప్రధాన భవనంలోని అనేక సదుపాయాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయన్నారు. మొదటి బ్యాచ్‌లో వాస్తవంగా వంద మంది విద్యార్థులు చేరాల్సి ఉండగా.. వసతులు లేకపోవడం, నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో 50 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారన్నారు. వీరికి కూడా సరైన హాస్టల్ వసతి, ఈ సంవత్సరం మరో బ్యాచ్ విద్యార్థులు చేరితే, వారికి వసతి కష్టమేనని తెలిపారు. సిబ్బందిని కూడా పూర్తిగా నియమించలేదని వెల్లడించారు. మొత్తం 180 మంది సిబ్బంది అవసరం కాగా, ప్రస్తుతం 79 మంది మాత్రమే ఉన్నారన్నారు. అనేకమంది అధ్యాపక సిబ్బందిని వివిధ ప్రాంతాల నుండి తాత్కాలిక ప్రాతిపదికన నియమించారని, వారికి క్వార్టర్లు లేవని తెలిపారు. బయట సరైన ఇళ్లు కూడా అద్దెకు దొరకవని, వీరికి చాలా అసౌకర్యంగా ఉందని తెలిపారు. ఈ సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లకు అనుమతులు రావాలంటే వెంటనే నిర్మాణాలు పూర్తి పూర్తి చేయాలని కోరారు. ప్రధాన భవనంలోని లెక్చర్ హాళ్లు, ల్యాబ్‌లు, విద్యార్థుల హాస్టల్, సిబ్బంది క్వార్టర్స్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా నిధుల కేటాయింపు, పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాదైనా వంద మంది విద్యార్థుల చేరికకు అనుమతి వచ్చేలా నిర్మాణాలు పూర్తి చేసి, మౌలిక వసతులు కల్పించి, శాశ్వత ప్రాతిపదికన పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని, వారికి గిరిజన ప్రాంత ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలని, ప్రత్యేక చొరవ తీసుకొని అన్ని పనులు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని అజశర్మ లేఖలో కోరారు.


పాల్‌కుమార్


ప్రవీణ్


సూర్య తేజ


గోదావరిలో ముగ్గురు విద్యార్థుల గల్లంతు

- గాలింపు చర్యలు ముమ్మరం

ప్రజాశక్తి-పి.గన్నవరం (కోనసీమ)/ ఆచంట (పశ్చిమగోదావరి)

గోదావరిలో ఎనిమిది మంది గల్లంతైన ఘటనలో ఒక పక్క గాలింపు సాగుతుండగానే అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మరో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానాలు చేయడానికి వచ్చి ముగ్గురు విద్యార్థులు గల్లంతైన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పి.గన్నవరం మండలం నాగులంకకు, పెదలంకకు చెందిన ఐదుగురు విద్యార్థులు పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్యలంక పంచాయతీ పరిధిలోని రావిలంక వశిష్ట గోదావరిలో సాయంత్రం 5 గంటల సమయంలో స్నానాలు చేయడానికి వచ్చారు. వీరిలో నాగులంకకు చెందిన కేతా ప్రవీణ్ (15), సానబోయిన సూర్య తేజ (12), పెదలంకకు చెందిన నీతు పూడి పాల్‌కుమార్ (12) గోదావరిలో దిగగా.. మరో ఇద్దరు విద్యార్థులు గట్టుపైనే ఉన్నారు. అయితే, ముగ్గురు విద్యార్థులు గల్లంతవ్వడంతో గట్టుపైన ఉన్న ఇద్దరు విద్యార్థులు భయపడి పారిపోయారు. గోదావరిలో విద్యార్థులు గల్లంతయ్యారని తెలిసిన తహశీల్దార్ జి.కనకరాజు, ఎస్ఐ కె.వెంకటరమణ, ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సమయం కావడంతో గల్లంతైన విద్యార్థుల ఆచూకీ లభించలేదు.


డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి



సిహెచ్.రాధాకృష్ణమూర్తి
గణితశాస్త్రం సబ్జెక్టు నిపుణులు,
సెల్ : 9030406000



గణితం మెథడాలజీ (ఎస్‌జిటి)



DSC-2025 పరీక్షలు త్వరలో ప్రారంభంకానున్నాయి. డిఎస్సీ-ఎస్జీటీ, స్కూల్ అసిసెంట్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు మరింతగా అప్రమత్తం కావాలి. ఇప్పటికే చేస్తున్న ప్రిపరేషన్‌లో వేగాన్ని పెంచటంతోపాటుగా మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేస్తే ఏ తరహా ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయో అర్థమవుతాయి. తద్వారా సబ్జెక్టు అంశాలు, అందులోని అభ్యాసాలు, గణిత బోధనా పద్ధతులు తదితర అంశాలపై క్షుణ్ణంగా, లోతుగా పరిశీలన, అవగాహన పెంపొందించుకోవటానికి దోహదపడుతుంది. తద్వారా ఏ ప్రశ్న వచ్చినా దానిని అవగాహన చేసుకుని గణిత అంశాల్లో అన్వయించి ప్రశ్నకు జవాబు రాయొచ్చు. జరగబోతున్న మెగా డిఎస్సీ పరీక్షలో టెట్ మార్కులకు 20 శాతం భారత్వమునకు సంబంధించిన రాత పరీక్షలు గతంలో అభ్యర్థులు రాశారు. మిగిలిన 80 శాతం భారత్వమునకు సంబంధించిన రాత పరీక్ష వచ్చే జూన్ నెలలో నిర్వహిస్తున్నట్లు ప్రభత్వం ప్రకటించిన విషయం అభ్యర్థులకు తెలిసిన విషయమే. ఈ తుది పరిక్షలో కేటాయించిన మార్కుల్లో గణిత బోధనా పద్ధతులకు 4 మార్కులు కేటాయించారు. ఈ విభాగం క్రింద 8 ప్రశ్నలు వస్తాయి. తుది పరీక్షలో మంచి మార్కులు సాధించటానికి మెథడాలజీ పాత్ర చాలా కీలకం. తేలికైన విషయం. ఈ క్రింది సూచనలను ప్రిపరేషన్ సమయంలో పాటిస్తే అభ్యర్థుల విజయంలో ఈ మెథడాలజీ కూడా భాగస్వామ్యం అవుతుంది -

1.సిలబస్‌పై దృష్టి
2.చదివే క్రమం
3.గత పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలపై దృష్టి
4.సాధారణంగా అభ్యర్థులు చేసే తప్పులు
5.ప్రస్తుత విద్యావిధానంపై అడిగే ప్రశ్నలు.
6.క్విక్ రివిజన్
7.మాదిరి ప్రశ్నాపత్రాలు

1.సిలబస్

SGT విభాగానికి గణిత మెథడాలజీకి సంబంధించిన సిలబస్ క్రింది విధంగా ఉంది.

1. గణితం నిర్వచనాలు, స్వభావం
2. గణితబోధనా ఉద్దేశాలు, లక్ష్యాలు, విలువలు
3.గణిత బోధనా పద్ధతులు.
4.గణితంలో బోధనోపకరణ సామాగ్రి, వనరుల వినియోగు
5.విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తకం, బోధనా ప్రణాళిక
6) మూల్యాంకనం, సిసిఇ

2.చదివే క్రమం:

గణిత మెథడాలజీని ప్రిపేర్ అయేటప్పుడు. ఒక క్రమంలో మాత్రమే ప్రిపరేషన్ కొనసాగించాలి. ఒక క్రమంలో నేర్చుకుంటే భావనలను సులువుగా అర్థం చేసుకోవచ్చు. పై సిలబస్ ను చదివే క్రమంలో ప్రథమంగా గణిత నిర్వచనాలు, గణితం అంటే ఏమిటి ? గణిత స్వభావాన్ని పూర్తిగా అభ్యసించాలి. తద్వారా గణిత మెథడాలజీలలో పారిభాషిక పదాలపై పట్టు లభిస్తుంది . ఆ తర్వాత గణితబోధనా ఉద్దేశ్యాలు, లక్ష్యాలు, విలువలను అభ్యచించాలి.దానితో పాటు విద్యాప్రమాణాలు కూడా తప్పనిసరిగా అభ్యసించాలి.

తదుపరి బోధనా పద్ధతులు -బోధనా ప్రణాళిక

- విద్యాప్రణాళిక-గణితంలో బోధనోపకరణ సామాగ్రి
- వనరుల వినియోగం-మూల్యాంకనం ఈ వరుసలో అభ్యసిస్తే మెథడాలజీపై సమగ్రంగా అవగాహన కలుగుతుంది.

3.గత పరీక్షలో అడిగిన ప్రశ్నలు :

అభ్యర్థులు గత పరీక్షలలో అడిగిన ప్రశ్నలపై దృష్టి సారించాలి. ప్రశ్నల కఠినత్వాన్ని అర్థం చేసుకుంటే ప్రస్తుత పరీక్షకు ఎంతో దోహదపడుతుంది. గత పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలు కొన్నింటిని పరిశీలిద్దాం..

1. గత 'గణితమంటే పరోక్షమాపనం' (Mathematics is a science of indirect measurement) అని నిర్వచించినవారు?

1.అరిస్టాటిల్ 2.ఆగస్ట్‌కోమ్టే 3.బెంజమన్ పీర్స్ 4.ఆర్కిమెడిస్ **జవాబు : ఆగస్ట్ కోమ్టే.** ప్రత్యక్షంగా కొలవలేని అనేక వాటిని పరోక్షంగా ఖచ్చితంగా గణితం కొలవగలదు.'

2.ఆగమన పద్ధతి ఒక లక్షణం

1.సాధారణ విషయాల నుండి ప్రత్యేక విషయాలకు
2.తెలియని విషయాల నుంచి ప్రత్యేక విషయాలకు
3.మూర్తం నుండి అమూర్తానికి
4.సూత్రం నుంచి ఉదాహరణకు **జవాబు : 3**

3."5,7,2,8లతో ఏర్పడే నాలుగు అంకెల అతిపెద్ద సంఖ్య ఏదీ?.ఈ పరీక్షాంశం ద్వారా పరీక్షించదలచిన విద్యాప్రమాణం

1.కారణాలు చెప్పటం-నిరూపణలు చేయటం 2. వ్యక్తపర్చడం
3.అను సంధానం 4.ప్రాతినిధ్య పర్చటం- దృశ్యీకరణ

సమాధానం : 1 ఇచ్చిన సంఖ్యతో ఏర్పడే అతిపెద్ద సంఖ్య లేదా, అతిచిన్న సంఖ్యను విద్యార్థి రాయటం అనేది కారణాలు-నిరూపణలకు చెందుతుంది. అలాగే ఇచ్చిన సంఖ్యలను ఆరోహణ, అవరోహణ క్రమాల్లో రాయడం కూడా కారణాలు - నిరూపణలకు చెందుతుంది

4.సాధారణంగా అభ్యర్థులు చేసే తప్పులు.

అభ్యర్థులు చేసే తప్పులు వారి విజయంలో ప్రతిబంధకంగా ఉంటాయి. తెలిసిన విషయాలనే తప్పులుగా పెట్టే సందర్భాలు కొన్ని ఉంటాయని అభ్యర్థుల నుండే వింటూ ఉంటాయి. వారు

5 కొన్ని సూచనలు పాటించటం ద్వారా తెలిసిన ప్రశ్నలకు చేసే తప్పులను తగ్గించి వారి విజయంలో కీలకం కావొచ్చు.

ఎ. ముందుగా ప్రశ్నను, సమాధానాలను చదివి, అర్థంచేసుకోవాలి
బి. ఇచ్చిన ప్రశ్న ఏ భావనకు చెందిదో గుర్తుకు తెచ్చుకోవాలి.
సి. ఇచ్చిన సమాధానాలను వరుసక్రమంలో గమనిస్తూ ప్రశ్నకు సరైన సమాధానాన్ని ఎంపిక చేయాలి.
డి. ఎంపిక చేసిన సమాధానాన్ని జాగ్రత్తగా కంప్యూటర్‌లో గుర్తించాలి.
ఇ. కొన్ని ప్రశ్నలు అభ్యర్థులను ఇబ్బందికి గురి చేసే విధంగా ఉంటాయి. వాటిని జాగ్రత్తగా అర్థం చేసుకుంటూ విశ్లేషిస్తూ సమాధానాన్ని రాబట్టొచ్చు.
ఎఫ్ : ప్రశ్నలు పెద్దవిగా అనగా ఎక్కువ లైన్లలో ఉన్నప్పుడు వాటిలో గల కీలక విభాగంపై దృష్టిపెడితే సమాధానం లభించే అవకాశం ఉంటుంది.
జి. అభ్యర్థులు సమయాన్ని అనుసరిస్తూ ఇచ్చిన సమయంలోనే ప్రశ్నాపత్రం పూర్తి చేయాల్సివుంటుంది అనే విషయాన్ని తప్పని సరిగా గుర్తుపెట్టుకోవాలి
హెచ్ : కఠినమైన ప్రశ్న వచ్చినప్పుడు దాని గురించే ఆలోచించి సమయాన్ని వృథా చేసుకోవద్దు. తర్వాత ప్రశ్నకు వెళ్లటమే మేలు. ఆ వదిలిన ప్రశ్నను రెండోసారి పునఃసమీక్షలో పూరిస్తే మంచిది.

5.ప్రస్తుత విద్యావిధానంపై అడిగే ప్రశ్నలు :

విద్యారంగంలో అమలు అవుతున్న నూతన అంశాలపై ప్రశ్నలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు పరిశీలిస్తే విద్యాప్రమాణాలు, నిరంతర సమగ్ర మూల్యాంకనం తదితర అంశాంపై ప్రశ్నలు తప్పనిసరిగా వచ్చే అవకాశం ఉంది. అభ్యర్థులు వీటిని క్షుణ్ణంగా అభ్యసిస్తే వాటిపై అడిగే ప్రశ్నలను సులభంగా సమాధానాలను గుర్తించొచ్చు.

1) విద్యార్థి 100 అనే సంఖ్యను 2X2X5X5గా వ్యక్తపరిచిన తద్వారా విద్యార్థిలో పరిక్షించిన విద్యాప్రమాణం.

సమాధానం: వ్యక్తపరచడం (Communication)

వివరణ : విద్యారి గణితపరమైన భావనలను వివిధ రూపంలో వ్యక్తపరచడం అనేది వ్యక్తపరచడం అన్నీ విద్యాప్రమాణాన్ని సూచిస్తుంది.

2) 3/5 అనే అకరణీయ సంఖ్యను సంఖ్యారేఖపై చూపండి

తద్వారా విద్యార్థిలో పరీక్షించదగిన విద్యాప్రమాణం ఏదీ?

1) సమస్యా సాధన
2) కారణాలు-నిరూపణలు
3).అనుసంధానం
4).దశ్యీకరణ- ప్రాతి నిధ్యపర్చటం . సమాధానం : 4

వివరణ : విద్యార్థి ఇచ్చిన సంఖ్యనుగానీ, భిన్నాన్ని గానీ, దశాంశ సంఖ్యలను గానీ, సంఖ్యారేఖపై చూపించటం అనేది దృశ్యీకర,ణ-ప్రాతినిధ్యపర్చటం క్రిందకు చెందుతుంది-

6.QUICK Revision

DSC తుది పరీక్షకు సమయం తక్కువగా ఉన్నందున అభ్యర్థులు సిలబస్‌ను Quick Revision చేయాల్సివుంది. దీనికోసం ముందుగా సిద్ధం చేసుకున్న నోట్స్, Error notes (తప్పులపై రాసే ప్రశ్నల వివరణ) అభ్యసిస్తే రివిజన్ అనే తొందరగా తక్కువ సమయంలో పూర్తి చేయొచ్చు. Quick revisionలో ప్రధాన అంశాలపై దృష్టిసారించాలి

7.మాదిరి ప్రశ్నాపత్రాలు

తుది పరీక్షకు వెళ్ళే ముందు అభ్యర్థులు కొన్ని మాదిరి ప్రశ్నా పత్రాలు రాయాల్సివుంటుంది. తద్వారా తుదిపరీక్షకు సన్నద్ధత, కాలం సద్వినియోగం ద్వారా విజయం సాధించటంలో కీలకం అవుతుంది.

DSC అభ్యర్థులు ఎంతో కఠినమైన ప్రిపరేషన్‌తో పరీక్షకు సన్నద్ధం అవుతారు. వారు సమయపాలన, వేగంగా సమాధ్మానాన్ని గుర్తించుట, కఠిన ప్రశ్నలకు సరైన విశ్లేషణలో సమధానాన్ని గుర్తించటం, ప్రశాంతంగా పరీక్షను రాయటం అనేది అభ్యర్థులు గుర్తించుకోగలరు. ఈ సన్నద్ధతే నీ విజయానికి పునాది.

1.మేథమెటిక్స్ అనే పదం గ్రీకు భాషలోని ఏ పదాల కలయిక ద్వారా ఏర్పడింది.

1.MANTHANEIN, TECHNOLOGY
2. MANTHANEIN,TECHNE
3.ARSMATHEMATICA
4.AN MATHEMATICS, MATHS

2 .మేథమెటిక్స్ అనే పదానికి మూలం లాటిన్ భాషలో ఏ పదము?

1.MANTHANEIN,2TECHNE 3.ARSMATHEMATICA 4.MATHS

3. ఆత్మ యొక్క ఉత్తమోత్తమైన అభ్యాసం ప్రపంచ వృత్తులన్నింటిలోనూ చక్కనిది గణితం అని నిర్వచించిన వారు?

4. 1.పాస్కల్ 2.బెల్
3.బెర్ట్రాండ్ రస్సెల్ 4.ఫ్రాన్సిస్ బేకన్

4.గణితమంటే పరిమాణశాస్త్రం అని నిర్వచించిన వారు

1.ఆర్కిమెడిస్ 2.ఆగస్ట్ కోమ్టే 3.మేరియాపియరీ
4. అరిస్టాటిల్

5.ఈ క్రింది వారిలో గణిత స్వభావం ఏది?

1.అమూర్త లక్షణం 2.తార్కికత
3.ఖచ్చితత్వం 4 పైవన్నీ

6.ఒక విషయాన్ని అనేక సార్లు పరిశీలించినప్పుడు ఒకే ఫలితాన్ని పొందినట్లయితే మిగిలిన అన్ని సందర్భాల్లో కూడా అదే ఫలితాన్ని ఇస్తుంది అలాంటి నమ్మకం కలిగితే అలాంటి విషయ నిర్ధారణను ఏమంటారు?

1.ఆగమన హేతువాదం 2.నిగమన హేతువాదం
3.గణిత అధ్యయనం 4.ఖచ్చితత్వం

7.ఈ క్రింది వారిలో ఆగమన హేతువాదానికి చెందిన అంశం

1.త్రిభుజంలోని మూడు కోణాల మొత్తం 180 డిగ్రీలకు సమానం అని సాధారణీకరించడం
2.దీ.చ.వైశాల్యం దాని పొడవు, వెడల్పుల లబ్ధానికి సమానం అని విషయ నిర్ధారణ చేయడం
3.పై రెండు బేసి సంఖ్యల మొత్తమైనా సరి సంఖ్యయే అని విషయ నిర్ధారణ చేయటం
4.పైవన్నీ

8. సంఖ్య, రాశుల, మాపనాల విజ్ఞానమే గణితం అని నిర్వసించిన వారు

1.పాస్కల్ 2.బెల్
బెంజమన్‌పీర్స్ 4.ఆగస్ట్ కోమ్టే

9. రామానుజన్ గణిత పరిశోధనా విషయాలన్నీ ముఖ్యంగా దీనికి సంబంధించినది?

1.అప్రోక్సిమేషన్ థియరీ 2.సంఖ్యావాదం
3.విభజన సిద్ధాంతం 4జాటోమేటా థియరీ

10.ఆర్యభట్టను నలందా విశ్వవిద్యాలయానికి కులపతిగా నియమించిన రాజు ?

1.సముద్రగుప్తుడు 2.చంద్రగుప్త విక్రమాదిత్యుడు
3.బుద్ధగుప్తుడు 4.బింబిసారుడు

11.గణితమంటే పరోక్షమాపనం అని నిర్వహించిన వారు

1.ఆగస్ట్‌కోమ్టే 2.అరిస్టాటిల్
3.హేన్రీపాయంకేర్ 4.లాక్

12.గణితమంటే అవసరమైన నిర్ధారణలను రాబట్టే శాస్త్రం అని నిర్వహించింది

1.పాస్కల్ 2.ఆగస్ట్‌కోమ్టే
3.అరిస్టాటిల్ 4.బెంజిమన్‌పీర్స్

13.నిగమనహేతువాదం ఏ అంశాలపై ఆధారపడివుంది?

1.అనిర్వచిత పదాలు 2.స్వీకృతాలు
3.సూత్రాలు 4.పైవన్నీ

14.గణితానికి పునాది లాంటిది?

1.ఖచ్చితత్వం 2.అమూర్త లక్షణం
3.గణితశాస్త్ర సంకేతాలు 4.తర్కం

15.ఈ క్రిందివానిలో గణిత స్వభావం

1.అమూర్త లక్షణం 2.సరిచూసే పద్ధతి
3.తర్కం 4.పైవన్నీ

జవాబులు:

1.2.	6.2	11.1
2.1	7.4	12.2
3.3	8.2	13.1
4.4	2	14.2
5.4	10.2	15.4

రేపు : జాతీయ ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక చట్రం-2009

సంపాదకీయం

వణికిన ముంబై

ముంబై మహానగరం చిగురుటాకులా వణికిపోయింది. సాధారణం కన్నా రెండు వారాల ముందుగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు 107 ఏళ్ల నాటి రికార్డులను చెరిపివేస్తూ కురిపించిన కుండపోతతో దేశ ఆర్థిక రాజధాని అతలాకుతలమైంది. ఎంతటి మహానగరమైనా వరుణుడు కన్నెర్ర చేస్తే నడిసంద్రంలా మారుతున్న తీరు మన పాలకుల ముందుచూపు లేమికి నిదర్శనంగా నిలిచిపోతోంది. గతంలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ... ఇలా ఎన్నో ఉదాహరణలు ఉండనే ఉన్నాయి. 2021లో ఇదే ముంబై నగరం భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయింది. ఆకస్మికంగా భారీ వర్షాలు కురిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై నిపుణుల కమిటీలు పలు సిఫార్సులు చేశాయి. కానీ, పాలకులు వాటిని అమలు చేయకుండా బుట్టదాఖలు చేయడం వల్లనే ఇటువంటి నష్టాలు తిరిగి సంభవిస్తున్న పరిస్థితి.

ధారాపాతంగా రాత్రంతా కురిసిన 200 మిల్లీమీటర్లకు మించిన వర్షపాతం ముంబైని ముంచెత్తింది. పొరుగున ఉన్న కొలాబాలో సోమవారం 295 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం 1918 నాటి రికార్డు 279.4 మిల్లీమీటర్లను తిరగరాసింది. దక్షిణ ముంబైలో 13 గంటల్లోనే 252 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లోనూ వర్షాలు ప్రభావం చూపాయి. కేరళలో రుతుపవనాలు ప్రవేశించిన పది రోజులకు మహారాష్ట్రకు రావాల్సి ఉండగా 24 గంటల్లోనే ఇక్కడ ప్రతాపం చూపాయి. సాధారణంగా ఏటా జూన్ 11న ముంబైలో రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈ ఏడాది 16 రోజులు ముందుగానే రావడం గత 75 ఏళ్లలో ఇదే తొలిసారి. మునిగిన రహదారులు, భూగర్భ మెట్రో లైన్లు, రైల్వే స్టేషన్లతో నగర జీవనం స్తంభించిపోయింది. రోడ్డు, రైలు, విమాన సర్వీసులకూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎల్లో అలర్ట్‌ను జారీచేయడం ద్వారా ఈ స్థాయి వర్షాలను అంచనా వేయడంలో భారత వాతావరణ శాఖ విఫలమైనట్టే! గతంలో వయనాడ్‌లో భారీ వర్షాలతో కొండచరియల బీభత్స సమయంలోనూ వాతావరణ శాఖ వైఫల్యం మనమెరిగిందే! ఇంతటి భారీ వర్షపాతానికి సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల, వాతావరణ మార్పులు ప్రధాన కారణమని ఐఎండి చెబుతోంది. వాతావరణ శాఖ మరింత అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా నష్టాల తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం అమలుకు అమెరికాలాంటి అగ్రరాజ్యాలు చేతులెత్తేయడం, పర్యావరణ పరిరక్షణకు చేసిన తీర్మానాల అమలుకు శ్రద్ధ చూపని ధనిక దేశాల తీరు ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను భారీగా పెంచేస్తున్నాయి. మూడో ప్రపంచ దేశాలకు పెనుముప్పుగా మారిపోతున్నాయి.

ఏటా అంతక్రితం ఏడాదితో పోలిస్తే భారీ వర్షాలు నమోదవుతూనే ఉన్నాయని కేంద్రప్రభుత్వ ఎర్త్ సైన్స్ విభాగం ఐదేళ్ల క్రితమే అంచనా వేసింది. కుండపోత వర్షాలు కురిసినా చెరువులు, వాగులు, వంకలు లాంటి సహజ సిద్ధమైన ప్రవాహ మార్గం ద్వారా గతంలో వెళ్లిపోయేవి. నగరాలు, పట్టణాల విస్తరణ, అక్రమార్కుల కబ్జాలు, వాటికి పాలకుల ప్రోత్సాహం... ఇవన్నీ నీటి ప్రవాహానికి ఎక్కడికక్కడ అడ్డంకులుగా వున్నాయి. గత ఏడాది విజయవాడను ముంచెత్తిన వరదలు కూడా ఇలాంటివే. ప్రకృతి వైపరీత్యాల నష్టాల తీవ్రతకు పాలకుల విధాన వైఫల్యమే ప్రధాన కారణం. మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ చూపకపోవడం నగరాలు, పట్టణాలు నీట మునకకు కారణమవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజిలు తదితర మౌలిక వసతులు కల్పించి, నీటి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకునేందుకు ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భుజంభుజం కలపాలి. ప్రకృతికి అనుకూలంగా ఉండే ప్రాజెక్టులను రూపొందించడం, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం, నూతన నగరాల నిర్మాణంలో, ఉన్న నగరాల విస్తరణలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లాంటి చర్యలు అత్యావశ్యకం.

మంచి మాట



నీవు కమ్యూనిస్టుగా వుండడమంటే అర్థం... యువతరాన్ని సంఘటితం చేసి ఐక్యపరచడం. ఈ కృషిలో తర్ఫీదు అంటే ఏమిటో, క్రమశిక్షణ అంటే ఏమిటో ప్రత్యక్ష ఆచరణ ద్వారా నీవు చూపెట్టాలి. అప్పుడే నీవు కమ్యూనిస్టు నిర్మాణమనే భవనాన్ని నిర్మించనారంభించి, క్రమంగా పూర్తిచేస్తావు.

- వి.ఐ. లెనిన్

విద్వేష రాజకీయాలకు 'నో' చెబుదాం!

ఎం.వి.ఎస్. శర్మ

విమర్శ

ప్రస్తుతం మధ్యప్రదేశ్ బిజెపి ప్రభుత్వంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా క్యాబినెట్ హోదాలో ఉన్న సీనియర్ బిజెపి నాయకుడు విజయ్ షా మీడియాలో పతాక శీర్షికలకెక్కారు. అదేదో గొప్ప పని చేసినందుకు కాదు, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న కల్నల్ సోఫియా ఖురేషీ గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు. ఆ వ్యాఖ్యలపై దేశమంతటా దుమారం రేగింది. విజయ్‌షా ను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేసి అతడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ కూడా వచ్చింది. చివరికి హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా స్పందించాయి. కాని బిజెపి ప్రభుత్వం మాత్రం విజయ్‌షాను వెనకేసుకొస్తూనే వుంది. అంటే రాజ్యాంగ వ్యవస్థల్ని సైతం ధిక్కరించి తమ విద్వేష రాజకీయాలను ప్రచారం చేయడానికి తయారౌతున్నారు! రాజ్యాంగ బద్ధంగా నిర్వహించవలసిన పదవుల్ని సైతం దుర్వినియోగ పరుస్తున్నారు.

ఈ విజయ్ షా ఈ విధంగా అసభ్యకర, విద్వేషపూరిత వ్యాఖ్యలు బహిరంగంగా చేయడం ఇదేమీ మొదటిసారి కాదు. బహుశా పత్రికల్లో తన పేరు రావాలంటే ఇటువంటి అసహ్యకరమైన పనులను మళ్ళీ మళ్ళీ చేయడమే మార్గం అని అతగాడు భావిస్తున్నట్టుంది. దాదాపు పదేళ్ళ క్రితం, విజయ్ షా రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యుడుగా ఉన్నాడు. అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భార్యపై ఒక బహిరంగ వేదిక పైనుండి అతడి సమక్షం లోనే అసభ్యకరంగా వ్యాఖ్యలు చేశాడీ విజయ్ షా. దానిని ప్రజానీకం తీవ్రంగా విమర్శించింది. ఆ తర్వాత తాను అలాంటి వ్యాఖ్య చేసినందుకు "పది సార్లు" క్షమాపణ కోరినట్టు విజయ్ షా ప్రకటించుకున్నారు. చివరికి అతడు మంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఐతే నాలుగు నెలలు తిరగకుండానే అతడిని మళ్ళీ క్యాబినెట్ మంత్రిగా నియమించారు!

2020లో విజయ్ షా అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు "షేరిని" అనే హిందీ సినిమా చిత్రీకరణ బాల్‌ఘాట్ వద్ద జరుగుతున్నప్పుడు అందులో నటిస్తున్న విద్యా బాలన్‌ను డిన్నర్‌కు ఆహ్వానించాడు. ఆమె ఆ ఆహ్వానాన్ని తిరస్కరించింది. దాంతో ఆ సినిమా షూటింగ్ ని ఆపేయించాడీ షా.

ఇంకొక సందర్భంలో రాట్లం అనే ఊరులో ఒక స్కూలులో జరుగుతున్న కార్యక్రమానికి ఇతడిని ముఖ్య అతిథిగా పిలిచారు. ఆ కార్యక్రమంలో ఆడపిల్లలకు టి-షర్ట్ లను పంపిణీ చేస్తున్నారు. ఆ సందర్భంలో షా చాలా అనుచితమైన రీతిలో "వాళ్ళకి రెండేసి టి-షర్టులివ్వండి. వాళ్ళు లోదుస్తులేం వేసుకుంటారో ఎవరికి తెలుసు?" అంటూ వ్యాఖ్యానించాడు! అతడి అసభ్యకర వ్యాఖ్యలను చివరికి స్కూలు పిల్లలు కూడా లక్ష్యం అయ్యారు.



> **ఆర్మీ ఆఫీసర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పకుండా అందరూ ఖండించి తీరాల్సిందే. కాని అంతటితోటే ఆగిపోతే మనకు బిజెపిలో లోతుగా వేళ్ళూనుకుని వున్న మనువాద, మహిళా-వ్యతిరేక ధోరణి కనిపించదు. విజయ్ షా ఒక్కడిలోనే ఈ ధోరణి కనిపిస్తోందనుకోకూడదు. అతడు బిజెపి వాస్తవ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు.**

2018లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి ఏవో నాలుగు మంచి మాటలు చెప్పి పోకుండా, "ఇప్పుడు గనుక మీరు చప్పట్లు కొట్టకపోతే వచ్చే జన్మలో మీరు ఇంటింటికీ చప్పట్లు కొట్టుకుంటూ తిరిగే వారిగా పుడతారు" అంటూ మాట్లాడారు. ఉపాధ్యాయులను అవమానపరచడమే కాదు, ట్రాన్స్‌జెండర్లను కూడా అవహేళన చేసే విధంగా మాట్లాడారు.

2022లో ఒక ఉపన్యాసంలో రాహుల్ గాంధీ గురించి ప్రస్తావిస్తూ అతడు బ్రహ్మచారిగా ఉండడానికి కారణం అతడికి 'మగతనం' లేకపోవడమే అంటూ చాలా నీచంగా మాట్లాడాడు.

ఇప్పుడు తాజాగా కల్నల్ ఖురేషీ గురించి మాట్లాడుతూ ఆమె పాకిస్తాన్‌లో ప్రవేశించి ఉగ్రవాదులను "బట్టలూడదీసి నిలబెట్టిందంటూ" మాట్లాడాడు. అతగాడి వ్యాఖ్యల్లో అంతర్లీనంగా పదే పదే వ్యక్తమైన 'సెక్సిస్ట్' ధోరణి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఐనప్పటికీ, అతడితోపాటు ఆ బహిరంగ వేదికపై ఉన్న బిజెపి ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి ఉషా ఠాకూర్‌కు మాత్రం అతడి మాటల్లో అభ్యంతరకరమైనవేవీ తోచినట్టు లేదు. ఆమె ఆ వ్యాఖ్యలకు స్టేజి పైనే పగలబడి నవ్వారు.

ఇంతవరకూ పేర్కొన్న సందర్భాలను చూస్తే వాటిలో మదం, విద్వేషం, అధికార దుర్వినియోగం వ్యక్తం అవుతున్నాయి. ఇదొక ఆందోళనకరమైన ధోరణి. పదే పదే విజయ్ షా ఈ విధంగా వ్యవహరించడం, అతడి సిగ్గుమాలిన ధోరణిని అతడి పార్టీ ప్రశ్నించకపోవడం దీర్ఘ కాలంగా కొనసాగుతోంది.

ఆర్మీ ఆఫీసర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పకుండా అందరూ ఖండించి తీరాల్సిందే. కాని అంతటితోటే ఆగిపోతే మనకు బిజెపిలో లోతుగా వేళ్ళూనుకుని వున్న మనువాద, మహిళా-వ్యతిరేక ధోరణి కనిపించదు. విజయ్ షా ఒక్కడిలోనే ఈ ధోరణి కనిపిస్తోందనుకోకూడదు. అతడు బిజెపి వాస్తవ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. అందుకే ఒక్క ఉమాభారతి తప్ప బిజెపి లోని ఏ ఇతర మహిళా నేతా అతడి వ్యాఖ్యలను ఖండించలేదు. నిజానికి ఉషా ఠాకూర్‌తో సహా చాలా మంది మహిళా నేతలు, మంత్రులు విజయ్ షా ను సమర్థిస్తూ మాట్లాడారు. వారికెవరికీ అతడి వ్యాఖ్యలు అభ్యంతరకరంగా తోచలేదట! ఉమా భారతి కూడా సాటి మహిళ అయిన సోఫియా ఖురేషీపై వ్యాఖ్యానించినందుకు ఖండించలేదు. సైన్యం గురించి అలా వ్యాఖ్యానించడం తప్పు అని ఆమె భావించారు. ఆమెకున్న అతి జాతీయవాద ధోరణి ప్రకారం సైన్యం అన్ని ఇతర వ్యవస్థలకూ అతీతం. కనుక అటువంటి సైన్యం గురించి తప్పుగా, అవహేళనగా మాట్లాడడం అంటే దేశద్రోహం అవుతుంది. అందుకోసం ఆమె విజయ్ షా ను ఖండించవలసి వచ్చింది. మానభంగం కేసులో శిక్ష పడిన నేరస్తుడు ఆశారాం బాపు ను వెనకేసుకు వచ్చినవారిలో మొదటి వ్యక్తి ఉమాభారతి అన్న వాస్తవాన్ని మనం మరిచిపోకూడదు.

మధ్యప్రదేశ్ బిజెపి శాఖలో మహిళల పరిస్థితి ఏమిటి? సాత్నా జిల్లా బిజెపి అధ్యక్షుడు తనకు అసభ్యకరంగా మెసేజ్‌లు పంపుతున్నాడంటూ ఒక మహిళా నేత ఆరోపించారు. పార్టీ ఆఫీసులో అడుగు పెట్టాలంటేనే భయంగా ఉందంటూ ఆమె వాపోయారు. సింగ్రౌలీ జిల్లా బిజెపి అధ్యక్షుడు బార్ డాన్సర్లతో అసభ్యకర నృత్యాలు చేస్తున్న వీడియో వైరల్ అయ్యింది.

మోహన్ యాదవ్ ముఖ్యమంత్రి అయిన కొద్ది రోజుల్లోనే అతడు తన ఎదురుగా ఉన్న వ్యక్తి తల్లినీ, అక్కచెల్లెళ్ళనీ ఉద్దేశించి బూతులు తిడుతున్న వీడియో ఒకటి, కాంగ్రెస్ వర్కర్ల చేత "ఆంబోతు పాలు" (ఆవు పాలు కాదు సుమా) తాగిస్తానంటూ సవాలు చేసిన వీడియో మరొకటి వెలుగులోకి వచ్చాయి. ఇదీ బిజెపి సంస్కృతి. తమది సాంస్కృతిక సంస్థ అని ప్రకటించుకునే ఆరెస్సెస్ నుంచి ఎటువంటి సంస్కృతి పుట్టుకొస్తోందో దీనిని బట్టి తేటతెల్లం ఔతోంది.

అందుకే ప్రధానమంత్రితో సహా ఏ బిజెపి నాయకులూ విజయ్ షా వ్యాఖ్యలను ఖండించలేదు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి గాని, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడికి గాని ఆ వ్యాఖ్యల్లో అభ్యంతరకరమైనవేవీ కనిపించనేలేదు. ఆ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోనేలేదు. "మురికి గుంటల్లో దొర్లేవాడు" అంటూ హైకోర్టు అతడి గురించి అన్నది. అంతేకాక అటువంటి వ్యక్తులు సైన్యానికే గాక దేశ ఐక్యతకు, మత సామరస్యానికి ప్రమాదకారులు అని కూడా అన్నది. అతడిపై దేశద్రోహ నేరం కింద చార్జిషీటు దాఖలు చేయమని పోలీసులను ఆదేశించింది. అది కూడా నాలుగు గంటల్లోపుగా అది జరగాలని ఆ న్యాయమూర్తి ఆదేశించారు. చెప్పిన గడువు లోగా ఎఫ్ఐఆర్ దాఖలు కాకుంటే డిజిపి కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు పరిగణిస్తామని కూడా హెచ్చరించారు. అయినా సరే రాత్రి 11 గంటల తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదైంది. తీరా ఆ ఎఫ్ఐఆర్ లో ఎక్కడా వాస్తవ సంఘటనను పేర్కొననే లేదు. పైగా విజయ్ షా పేరు వచ్చిన ప్రతీసారీ దానికి ముందు శ్రీ అని చాలా గౌరవంగా సంబోధించారు. ఈ వైఖరి పట్ల కోర్టు తీవ్రంగా స్పందించింది. ఆ ఎఫ్ఐఆర్ రాసిన తీరు ముద్దాయిని వెనకేసుకు వచ్చేలా ఉందని, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తోందని కోర్టు మండిపడింది.

సుప్రీంకోర్టు కూడా విజయ్‌షా ను మందలించింది. ఉన్నత పదవుల్లో ఉన్నవారు తమ మాటల విలువ ఏమిటో తెలుసుకోవాలని చెప్పింది. ఇప్పుడు షా క్షమాపణ కోరడం కేవలం మొసలి కన్నీళ్ళేనని అన్నది. ఒక సిట్‌ను ఏర్పాటు చేసి మే 28 లోగా నివేదిక తనకు ఇవ్వాలని ఆదేశించింది.

ఒక్క విజయ్ షా యే కాదు, బిజెపిలో ఎవరికీ భారత రాజ్యాంగం పట్ల గౌరవం ఇసుమంత కూడా లేదు. ఇక ప్రజాస్వామ్యం, లౌకికతత్వం గురించి చెప్పనక్కరలేదు. మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవదా ఆపరేషన్ సిందూర్ జయప్రదం అయినందుకు ఉత్సవం జరుపుతూ, "దేశం యావత్తూ మోడీ గారికి వంగి నమస్కరిస్తోంది" అని ప్రకటించారు. అక్కడితో ఆగకుండా "ఈ దేశమే కాదు, మొత్తం సైనిక దళాలు కూడా మోడీకి వంగి నమస్కరించాలి" అన్నారు. ప్రజాస్వామ్యంలో అందరూ ప్రజలకి వంగి నమస్కరించాలి. కాని బిజెపి పాలనలో మాత్రం ప్రజలే పాలకులకు వంగి నమస్కరించాలన్నమాట. భూస్వామ్య సమాజంలో రాజుకు ప్రజలందరూ సేవకులే అన్న భావన ఉండేది. బిజెపి లో పేరుకుపోయిన ఫ్యూడల్ భావజాలం జగదీష్ దేవదా ప్రకటనల్లో కనిపిస్తోంది.

దేశమంతా విజయ్ షా, జగదీష్ దేవదా ల వ్యాఖ్యలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నా, సైనిక దళాలకు రాజ్యాంగబద్ధంగా అధిపతి అయిన రాష్ట్రపతికి మాత్రం కనీసం చీమ కుట్టినట్టు అయినా లేదు.

మన రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఏవీ విజయ్ షా వ్యాఖ్యల మీద నోరు విప్పే సాహసం చేయలేదు. మళ్ళీ వీళ్ళందరూ సినీ, రాజకీయ జీవితాల్లో హీరోలట!

ఇంతగా బరితెగిస్తున్న బిజెపి కి దేశ ప్రజానీకమే తగిన విధంగా బుద్ధి చెప్పాలి. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని కోరుకునేవారు, మనువాదాన్ని భూస్థాపితం చేయగోరేవారు అందరూ నోళ్ళు విప్పాలి.

జిడిపి-గొప్పలూ తిప్పలూ!


విశ్లేషణ

జపాన్‌ను వెనక్కు నెట్టేసి మన దేశం ప్రపంచ జిడిపిలో నాల్గవ స్థానానికి చేరిందని, రెండున్నర లేదా మూడు సంవత్సరాల్లో జర్మనీని కూడా పక్కనపెట్టి మూడవ స్థానానికి వెళతామని నీతి ఆయోగ్ సిఇవో బివిఆర్ సుబ్రమణ్యం చేసిన ప్రకటనకు మీడియాలో పెద్ద స్పందనే వచ్చింది. అనేక మంది సంతోషిస్తున్నారు. ఇదొక గొప్పా అని పెదవి విరిచేవారు కూడా ఉన్నారు. నూట నలభై కోట్ల జనాభాలో ఈ లెక్కల ఆల్జీబ్రా ఎంతమందికి అర్థమవుతుంది? "నేను చెప్పినట్లుగా మనది నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ, నాలుగు లక్షల కోట్ల ఆర్థికం, ఇది నేను చెబుతున్న సమాచారం కాదు. ఐఎంఎఫ్ చెబుతున్నది, జపాన్ కంటే పెద్ద ఆర్థిక వ్యవస్థ" అని సుబ్రమణ్యం నీతి ఆయోగ్ పాలక మండలి పదవ సమావేశంలో ప్రకటించారు. మనం రూపొందించిన పథకం ప్రకారం జరిగితే రెండు, రెండున్నర, మూడు సంవత్సరాల్లో మనది మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందన్నారు. ఐఎంఎఫ్ ఏప్రిల్ 22 సమాచారం ప్రకారం వర్తమాన ధరల్లో సాధారణ (నామినల్) జిడిపి అమెరికా 30.51 లక్షల కోట్ల డాలర్లు, చైనా 19.23, జర్మనీ 4.74, భారత్ 4.19, జపాన్ 4.19, బ్రిటన్ 3.84, ఫ్రాన్సు 3.21, ఇటలీ 2.42, కెనడా 2.23, బ్రెజిల్ 2.13 లక్షల కోట్లతో మొదటి పది స్థానాల్లో ఉన్నాయి. 2025-26 నాటికి మన జిడిపి 4.187.017, జపాన్‌లో 4.186.431 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. బొమ్మను పాలకులు ఎలాగూ చూపించారు, వారు మూసిపెట్టే బొరుసు ఎలా ఉందో చూడాలి కదా !



ఎం. కోటేశ్వరరావు

నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన తరువాత 2015లో 2.1 లక్షల కోట్ల డాలర్ల నుంచి 2025లో దేశ జిడిపి 4.3 లక్షల కోట్ల డాలర్లకు చేరినట్లు, ఇది 105 శాతం పెరుగుదల అని ఐఎంఎఫ్ కొద్ది నెలల క్రితం చెప్పింది. అదే సంస్థ తాజాగా విడుదల చేసిన అంచనాలో ఆ మొత్తాన్ని 4.187 లక్షల కోట్లకు తగ్గించింది. జపాన్ మొత్తం 4.186 గనుక దాన్ని పక్కన పెట్టి మనకు నాలుగో స్థానాన్ని ఇచ్చింది. తేడా ఎంత? 0.001 లక్షల కోట్లు. చెవులపుగించే వారుంటే కాకమ్మ కతలు చెప్పేవారికి కొదవ ఏముంది. బిజెపి పెద్దలు 2025 నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు పెంచుతామని గొప్పలు చెప్పుకున్న అంశం ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంతటి అభివృద్ధిని ఏ ప్రభుత్వమూ సాధించలేదని కూడా బిజెపి ఐటి సెల్ మాలవీయ సెలవిచ్చారు. అలా ప్రచారం చేయటమే కదా ఆ పెద్దమనిషి ఉద్యోగం. వాస్తవం ఏమిటి, 2004లో మన్మోహన్ సింగ్ అధికారానికి వచ్చినపుడు జిడిపి 709 బిలియన్ డాలర్లు కాగా 2014 నాటికి అది 2030 బిలియన్లకు పెరిగింది. యుపిఏ పాలనా కాలంలో పెరుగుదల రేటు 186 శాతమని, 105 కంటే ఎక్కువని కాస్త నిజాయితీ ఉన్నవారు కూడా చెబుతారు.



> **పదేళ్లలో జిడిపి రెట్టింపు అని ఇతర గొప్పలు కానీ...పది సంవత్సరాల్లో (2014 -2024) మన ఆకలి సూచిక స్కోరు 28.2 నుంచి 27.3కు మాత్రమే తగ్గింది. దీనిలో అంత అభివృద్ధి ఎందుకు రాలేదు? ఇదే కాలంలో పాకిస్తాన్ స్కోరు 29.6 నుంచి 27.9కి తగ్గింది. దీని గురించి చెబితే ఈ దేశంలో పుట్టీ, ఈ దేశంలో పెరిగీ, అన్నం తింటూ పక్క దేశాన్ని పొగుడుతున్నట్లు ఎదురు దాడి చేస్తారు. పాక్ ర్యాంకు మన తరువాత 109, ఆకలిని ఎవరు ఎక్కువగా తగ్గించినట్లు?**

గతంలో ప్రధాని చెప్పిన కొన్ని అతిశయోక్తుల గురించి చెప్పుకుందాం. "గత పదేళ్లలో జిడిపిని రెట్టింపు చేయటం అంకెలు కాదు, 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖ దాటించి నూతన మధ్య తరగతిని సృష్టించాం. వారు కొత్త జీవితాన్ని ప్రారంభించారు, సచేతనంగా ఆర్థికవృద్ధికి తోడ్పడుతున్నారు". ప్రధాని నోటి నుంచి జాలువారిన ఈ మాటలను చూసి నవ్వాలా ఏడవాలో తెలియటం లేదు. ఇరవై ఐదు కోట్ల మందిని దారిద్ర్య రేఖ నుంచి ఎగువకు లాగాం అంటూనే కనీసం ఆహారధాన్యాలు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్న 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార భద్రతా పథకం కింద గోధుమలు, బియ్యం ఇస్తున్నామని, మరికొన్నేళ్లు ఇస్తామని ఒక ఘనతగా చెప్పుకుంటారు. ప్రపంచ ఆకలి సూచికలో తాజాగా 127లో 105వ దేశంగా ఉన్నాం. ఆకలి లేని (9.9), స్వల్ప (10 నుంచి 19.9), తీవ్రం (20 నుంచి 34.9), ఆందోళనకరం (35 నుంచి 49.9), అత్యంత ఆందోళనకరం (50 పైన) అనే ఐదు తరగతులుగా దేశాలను విభజిస్తే మన దేశం తీవ్ర తరగతిలో అంతకు ముందు, గత పదేళ్లుగా కూడా ఉంది. పదేళ్లలో జిడిపి రెట్టింపు అని ఇతర గొప్పలు కానీ పది సంవత్సరాల్లో (2014-2024) మన ఆకలి సూచిక స్కోరు 28.2 నుంచి 27.3కు మాత్రమే తగ్గింది. దీనిలో అంత అభివృద్ధి ఎందుకు రాలేదు? ఇదే కాలంలో పాకిస్తాన్ స్కోరు 29.6 నుంచి 27.9కి తగ్గింది. దీని గురించి చెబితే ఈ దేశంలో పుట్టీ, ఈ దేశంలో పెరిగీ, అన్నం తింటూ పక్క దేశాన్ని పొగుడుతున్నట్లు ఎదురు దాడి చేస్తారు. పాక్ ర్యాంకు మన తరువాత 109, ఆకలిని ఎవరు ఎక్కువగా తగ్గించినట్లు? గత పదేళ్లలో చైనా స్కోరు ఐదు కంటే తక్కువే ఉందన్న వాస్తవాన్ని చెబితే నానా యాగీ చేస్తారు. మోడీ సాధించిన విజయాలు మీకు పట్టవా అంటారు కొందరు. నిజమే 188 దేశాల జిడిపిలో మనల్ని నాల్గవ స్థానంలోకి తీసుకు వెళ్లినందుకు మోడీ ఘనత ఖాతాలో వేద్దాం. అదే తలసరి జిడిపిలో 136వ స్థానంలో ఉంచిన ఘనుడని కూడా కీర్తించాలా! తలసరి జిడిపి కూడా నిజానికి ఒక మైండ్ గేమ్ తప్ప మరొకటి కాదు. కొందరి దగ్గర సంపదలు పోగు పడటం అంటే ఆర్థిక అసమానతలు పెరుగుతున్నట్లే, మోడీ ఏలుబడిలో పెరిగినట్లు స్పష్టంగా తేలింది. గోచిపాతరాయుడు సంపద ఒక రూపాయి, 50,49 చొప్పున అంబానీ, అదానీల సంపదలు ఒక దగ్గర చేర్చి మూడుతో భాగిస్తే వచ్చే 33 గోచిపాతరాయుడి సంపద అంటే నవ్వీపోతారు

అసలు జిడిపి ని సాధారణ (నామినల్), పిపిపి (పవర్ పర్చేజింగ్ పారిటీ) పద్ధతుల్లో లెక్కిస్తున్నారు. రెండవదే వాస్తవానికి దగ్గరగా ఉంటుందన్నది కొందరి సమర్ధన. దాని ప్రకారం చూస్తే నరేంద్ర మోడీ అధికారానికి వచ్చే నాటికే మన దేశం సాధారణంలో పది, రెండవ లెక్కలో మూడవ స్థానంలో ఉంది. మోడీ గణం రెండవ లెక్కలను ఎందుకు చెప్పటం లేదు. ఎందుకంటే దేశాన్ని ఇప్పటికీ అదే స్థానంలోనే మోడీ ఉంచారు గనుక. ఐఎంఎఫ్ 2025 పిపిపి అంచనా ప్రకారం చైనా 42.72, అమెరికా 30.51, భారత్ 17.65 లక్షల కోట్ల డాలర్లతో మూడవదిగా, రష్యా నాలుగు, జపాన్ ఐదవదిగా ఉంది. 2027 తొలి ఆరు నెలల్లోనే సాధారణంలో 4.9 లక్షల కోట్ల డాలర్లతో జర్మనీని కూడా దాటించేస్తారని ఊదరగొడుతున్నారు. అవన్నీ గిడసబారిన దేశాలుగా మారుతున్నాయి. దున్నబోతే దూడల్లో మెయ్యబోతే ఆంబోతుల్లో అన్నట్లుగా చెప్పుకుంటే ఎలా?

రానున్న కొద్ది సంవత్సరాల్లో మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నందుకు ఇప్పటి నుంచి సంబరాలు జరుపు కుంటున్న వారిని చూసి ఆర్థిక నిపుణుడు డి. ముత్తుకృష్ణన్ ఉత్సవాలు జరుపుకోవాల్సినంత ఘనత ఏమి సాధించామని 2024లోనే ప్రశ్నించారు. జిడిపిలో ఏ స్థానంలో ఉన్నామన్నది కాదు తలసరి రాబడిలో ప్రపంచంలో మనం 140వ స్థానంలో ఉన్నామని, మనకంటే 139 దేశాలు ముందున్నాయని గుర్తించాలని చెప్పారు (తాజాగా 136 గనుక 135 ముందున్నాయి). పిపిపి ప్రకారం చూసినా మన స్థానం 119 అని చెప్పారు. పదేళ్లలో మన జిడిపి 105 శాతం పెరిగిందని ఏ ఐఎంఎఫ్ చెప్పిందో అదే సంస్థ 2025 తలసరి జిడిపిలో 141వ స్థానం అని కూడా జోశ్యం చెప్పింది. దివాలా తీసిందని చెప్పిన శ్రీలంక 133, బంగ్లాదేశ్ 143, పాకిస్తాన్ 159, సీ జిన్‌పింగ్ ఏలుబడిలో కుప్పకూలి పోయిందని కొంత మంది చెప్పే చైనా 71వ స్థానంలో (తాజాగా 70) ఉందని కూడా ఐఎంఎఫ్ చెప్పింది. మన తలసరి రాబడి పది వేల డాలర్లకు చేరాలంటే కనీసం 30 సంవత్సరాలు కష్టపడి పని చేయాలని, దానికి అనుకూలమైన ఆర్థిక పరిస్థితులు ఉండాలని ముత్తుకృష్ణన్ చెప్పారు. చైనా తలసరి జిడిపి 2025లో 13,873 డాలర్లు, ఇప్పుడున్న మన 2,937 డాలర్ల నుంచి ఎదిగి ప్రథమ స్థానంలో ఉన్న మొనాకో 2,56,581 (2023 ప్రపంచ బ్యాంకు సమాచారం) లేదా డాలర్ దేవుడున్న అమెరికా 89,678 (2025 ఐఎంఎఫ్) స్థాయికి, చివరికి పడక కుర్చీ మేథావులు చెబుతున్నట్లుగా అధిగమించే దూరం ఎంతో లేని చైనాను అయినా కనీసం అధిగమించాలంటే ఎంత సమయం పడుతుందో వేరే చెప్పనవసరం లేదు.

ప్రపంచ సవాళ్లు ఉన్నప్పటికీ నరేంద్ర మోడీ నాయకత్వం కారణంగా ప్రపంచ వెలుగు దివ్వెగా భారత్ ముందుకు వచ్చిందని బిజెపి నేత ప్రదీప్ బండారీ చెప్పిన మాటలు భజనరాయుళ్ల గళం తప్ప మరొకటి కాదు. పదకొండు సంవత్సరాలుగా వేసిన పునాదులే కారణమన్నారు. ఐరోపా దేశాలు, జపాన్ ఆర్థిక వ్యవస్థలు పెరుగుదల లేక గిడసబారి పోయాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ఉన్న వలసలను కోల్పోయిన బ్రిటన్, ఫ్రాన్స్ మాజీ రాజుల వలే ఉన్నాయి. మిలిటరీలను నిషేధించిన కారణంగా అందుకు వెచ్చించే సొమ్మును పరిశోధనలకు మళ్లించి జర్మనీ, జపాన్, అమెరికా ఇచ్చిన దన్నుతో దక్షిణ కొరియా వేగంగా వృద్ధి చెందాయి. ఇప్పుడు వాటికి పరిమితి ఏర్పడింది కనుకనే మనం ముందుకు వస్తున్నాం. ఒక నాడు మనకంటే వెనుకబడి ఉన్న చైనాతో తప్ప వాటితో పోల్చుకుంటే ఎలా! అదేమంటే చైనా కమ్యూనిస్టు దేశమంటారు, మనది ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఎక్కువ గనుక దాని కంటే ఎంతో ముందు ఎందుకు లేదు అంటే సమాధానం ఉండదు. ఒక ఐదు సంవత్సరాల పాటు ఐదు లక్షల కోట్ల డాలర్ల గురించి ఊదరగొట్టారు. ఇప్పుడు పది లక్షల కోట్ల గురించి చెప్పబోతున్నారు. 1950లో మన దేశంలో 20 కోట్ల మంది జనం ఉపాధి కోసం వ్యవసాయంపై ఆధారపడ్డారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సాగు భూమి ఎంత పెరిగింది, ఎంత తగ్గింది అన్న లెక్కలను పక్కన పెట్టి స్థిరంగా ఉందనుకున్నప్పటికీ అదే భూమి మీద 2023-24లో జనాభాలో 46.1 శాతం మంది ఆధారపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వే తెలిపింది. ఆరు సంవత్సరాల క్రితంతో పోల్చితే రెండు శాతం పెరిగారు. అంటే ఇప్పుడు 67 కోట్ల మంది పని చేస్తున్నారు. చైనాలో 24.1 శాతం లేదా 17.66 కోట్ల మంది (2023) పని చేస్తున్నారు. భూమి మీద ఆధారపడే వారు తగ్గటం అభివృద్ధి చెందిన దేశాల లక్షణం. వెనుకటికి ఒకడు మాది నూటొక్క అరకల వ్యవసాయం అని గొప్పలు చెప్పాడట. మీది అంటున్నావు ఎవరెవరికి ఎన్ని అంటే నాది ఒకటి మా అయ్యగారివి వంద అన్నాడట. జిడిపి కూడా అంతే!

ఇజ్రాయిల్ నరమేధానికి 600 రోజులు

54 వేల మంది బలి



గాజా : గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు బుధవారంతో 600 రోజులకు చేరుకుంటాయి. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ చేస్తున్న విధ్వంసక దాడులు ముగించాలని ఒత్తిడి పెంచడానికి ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 30, 31, జూన్ 1 తేదీల్లో నిరసనలు చేపట్టాలని హమాస్ మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. 'గాజా ప్రజలపై జరిగిన మారణహోమం, ఆకలి నేరాలు ఖండించడానికి, తిరస్కరించడానికి, గాజా, జెరూసలేం, పవిత్రమైన అల్-అక్సా మసీదుకు సంఘీభావంగా ప్రపంచవ్యాప్తంగా నిరసనల్లో పాల్గొనండి' అని ఈ ప్రకటనలో తెలిపింది. గాజా స్ట్రిప్‌పై దురాక్రమణ, మారణహోమం, ఆకలి చావులకు వ్యతిరేకంగా అన్ని రకాల నిరసన చర్యలను తీవ్రతరం చేయాలని కూడా కోరింది.

2023 అక్టోబర్ 7న గాజాపై ఇజ్రాయిల్ తన క్రూరమైన దాడిని ప్రారంభించింది. అప్పట్నుంచి నిరవధికంగా వైమానిక, భూతల దాడులకు పాల్పడుతోంది. ఈ దాడుల్లో ఇప్పటి వరకూ 54 వేల మందికిపైగా మరణించారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే. మరో 12,31,100 మంది గాయపడ్డారు. గాజాలో 90 శాతం మంది ప్రజలు నిరాశ్రయులుగా మారారు. గాజాపై దాడులు చేయడంతోపాటు ఆ ప్రాంతానికి అందుతున్న ఆహారం, వైద్యం, మానవతా సహాయాన్ని ఇజ్రాయిల్ అడ్డుకుంటోంది. పౌరులపై యుద్ధ నేరాలకు పాల్పడినందుకు అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) వద్ద మారణహోమం కేసును కూడా ఇజ్రాయిల్ ఎదుర్కొంటోంది.

ప్రతిపక్ష ఎంపిలే మెరుగు : కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రపంచానికి చాటిచెప్పడంలో ప్రతిపక్ష ఎంపిలు ఎంతో సమర్థవంతంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ప్రచార విభాగాధిపతి పవన్ ఖేర్ అన్నారు. ఢిల్లీలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... కేంద్రం ట్రోల్స్ ద్వారా ప్రేరణ పొంది నడుస్తోందని అన్నారు. సినీ నటుల్లా ప్రధాని డైలాగులు చెబుతున్నారని చెప్పారు. పహల్గామ్ ఉగ్ర దాడి తరువాత ప్రభుత్వం కంటే ప్రతిపక్ష సభ్యులు ఎంతో సమర్థవంతంగా, మెరుగ్గా దేశ ప్రయోజనాలను ముందుపెట్టారని అన్నారు. భావితరాలకు పాఠం చెప్పడానికి ఈ వ్యత్యాసం చాలా ముఖ్యమని అన్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకులు సోషల్ మీడియా ప్రదర్శనకే పరిమితమయ్యారని, విద్వేషాన్ని ప్రచారం చేస్తున్నారని అన్నారు.

గుజరాత్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ స్పందించారు. ప్రభుత్వ స్పందన అవసరమయ్యే చాలా తీవ్రమైన సమస్యల నుండి దృష్టిని మళ్లించడానికి ప్రధాని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పహల్గామ్ దాడికి కారణమైన వారిని పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమవ్వడాన్ని ఆయన ప్రశ్నించారు. భారత్ – పాక్ మధ్య కాల్పుల విరమణపై 11 రోజుల్లో 8 సార్లు అమెరికా ప్రకటన చేసిందని, దీనిపై ప్రధాని మౌనంగా ఎందుకున్నారని నిలదీశారు.

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు కమాండర్ మృతి

రాంచీ : జార్ఖండ్‌లోని పలము జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు కమాండర్ హతమయ్యాడు. పదిహేను లక్షల రూపాయల రివార్డు ఉన్న నితీష్ ఈ ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డాడని పోలీస్ సీనియర్ అధికారి ఒకరు మంగళవారం తెలిపారు. ఎదురు కాల్పుల తర్వాత భద్రతా దళాలు ఆ ప్రదేశంలో అనేక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మహుముద్‌గంజ్, హైదర్‌నగర్ మధ్య సోమవారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో చనిపోయిన మావోయిస్టు కమాండర్‌ను గుర్తించాల్సి ఉన్నదని పోలీసులు చెప్పారు. అయితే ఆ మృతదేహం ప్రముఖ మావోయిస్టు కమాండర్ తులసి భునియన్‌దేనని ఓ పోలీస్ అధికారి తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ సందర్భంగా నితీష్ యాదవ్ అనే మరో మావోయిస్టుకు బులెట్ గాయాలయ్యాయి. అతనిపై పదిహేను లక్షల రూపాయల రివార్డ్ ఉంది.

పాకిస్తాన్ నుండి వచ్చి ఉండొచ్చు

- ముస్లిం అధికారిపై బిజెపి నేత అనుచిత వ్యాఖ్యలు
- కేసు నమోదు చేసిన కర్ణాటక పోలీసులు

బెంగళూరు : కర్ణాటకలోని కలబురగి జిల్లా డిప్యూటీ కమిషనర్, జిల్లా మెజిస్ట్రేట్ ఫౌజియా తరన్నమ్‌పై బిజెపి నాయకుడు, ఎమ్మెల్సీ ఎన్.రవికుమార్ నోరు పారేసుకున్నారు. శాసనమండలిలో ప్రతిపక్షాల చీఫ్ విప్‌గా కూడా వ్యవహరిస్తున్న రవికుమార్ ఆ ముస్లిం అధికారిని ఉద్దేశించి 'ఆమె పాకిస్తాన్ నుండి వచ్చి ఉండవచ్చు' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో రవికుమార్‌పై కలబురగిలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బిజెపి నేత వ్యాఖ్యలను కర్నాటక ఐఎఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. 'ఐఎఎస్ అధికారి ఫౌజియా తరన్నమ్ ప్రజలకు, రాష్ట్రానికి ఎన్నో సేవలు అందిస్తున్నారు. ఆమెపై రవికుమార్ చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవి. అవి న్యాయసమ్మతం కావు. ఇలాంటి వ్యాఖ్యలు ఐఎఎస్ అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాయి. వారికి మానసిక ఆందోళన కలిగిస్తాయి. ఈ వ్యాఖ్యలు చేయడమంటే విధి నిర్వహణలో ఉన్న అధికారులను వేధించడమే అవుతుంది' అని ఆ సంఘం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

బాధ్యతారాహిత్యమైన, అంగీకారయోగ్యం కాని వ్యాఖ్యలు చేసినందుకు రవికుమార్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్ చేసింది. జిల్లా మెజిస్ట్రేట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారిపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేసినందుకు ఆయనపైన కేసు నమోదు చేయాలని పట్టుబట్టింది. ఈ వివాదంపై తరన్నమ్ ఇంకా స్పందించలేదు. ఎన్నికల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరచినందుకు ఆమెకు గతంలో అవార్డు కూడా వచ్చింది. మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో భాగస్వామి అయిన కల్నల్ సోఫియా ఖురేషీపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆమెను ఉగ్రవాదుల సోదరిగా ఆయన అభివర్ణించారు. దీనిపై మండిపడిన సుప్రీంకోర్టు ఆయన క్షమాపణను తోసిపుచ్చింది. అయినప్పటికీ మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం ఆయనపై ఎలాంటి చర్య తీసుకోలేదు.

రెండో రౌండ్‌కు సింధు, ప్రణయ్

సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



సింగపూర్: సింగపూర్ ఓపెన్ సూపర్-750లో భారత బ్యాడ్మింటన్ స్టార్లు పివి సింధు, హెచ్ఎస్ ప్రణయ్ ముందంజ వేయగా.. కిరణ్ జార్జ్, ప్రియాన్షు రాజావత్ తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. మహిళల సింగిల్స్‌లో పివి సింధు 21-14, 21-9తో కెనడా ప్లేయర్ వాంగ్‌ను చిత్తు చేసింది. ఇక పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ తనకంటే మెరుగైన ర్యాంకర్ డెన్మార్క్‌కు చెందిన రస్మస్ జెమ్కేపై 19-21, 21-16, 21-14తో మూడుసెట్ల హోరాహోరీ పోరులో విజయం సాధించాడు. తొలి గేమ్ కోల్పోయిన ప్రణయ్.. వరుసగా రెండు సెట్లలో పైచేయి సాధించి విజేతగా మ్యాచ్ ముగించాడు. తదుపరి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టోఫ్ పోపోవ్‌ను ప్రణయ్ ఎదుర్కోనున్నాడు. ఇతర పోటీల్లో మాళవిక బన్సోద్, అన్మోల్ ఖార్బ్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్‌లు తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. మలేషియా మాస్టర్స్‌లో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన పీవీ సింధు ఈసారి అదరగొట్టింది. సింధు రెండో రౌండ్‌లో టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన చెన్ యూ ఫెయా(చైనా)తో తలపడనుంది. గత సీజన్ నుంచి ఒక్క టైటిల్ గెలుపొందని సింధు.. సింగపూర్ ఓపెన్‌లో విజేతగా నిలవాలనే కసితో ఉంది.

2 పరుగులకే 10 వికెట్లు

ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్ నమోదు




లండన్: క్రికెట్‌లో మరో సంచలనం నమోదైంది. ఒక టీమ్ కేవలం 2పరుగులకే ఆలౌటై చెత్త రికార్డు మూటగట్టుకుంది. 427పరుగుల భారీ ఛేదనలో ప్రత్యర్థి బౌలర్ల దెబ్బకు కేవలం 2 పరుగులకే 10 వికెట్లు కోల్పోయింది. ఈ రెండు పరుగుల్లో ఒకటి వైడ్ రూపంలో లభించిందే. ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్‌లో రిచ్‌మండ్స్ ఫోర్త్ ఎలెవెన్ జట్టు బ్యాటర్లు మాత్రం ఘోరంగా విఫలమయ్యారు. దాంతో, మిడిల్‌సెక్స్ లీగ్‌లో భాగంగా మే 24న నార్త్ లండన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 2 పరుగులకే కుప్పకూలింది. ప్రత్యర్థి నిర్దేశించిన 427 పరుగుల ఛేదనలో రిచ్‌మండ్స్ ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. నార్త్ లండన్ ఆటగాళ్లు రెచ్చిపోయి ఆడిన చోట రిచ్‌మండ్స్ ప్లేయర్లు మాత్రం తేలిపోయారు. వచ్చినవాళ్లు వచ్చినట్టు పెవిలియన్ చేరారు. ఒకరిద్దరు కాదు ఏకంగా ఎనిమిది మంది డకౌట్ అయ్యారు. 5.4 ఓవర్లలోనే ఆ జట్టు రెండంటే రెండే పరుగులకు 10 వికెట్లు కోల్పోయి భారీ ఓటమి ఖాతాలో వేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన నార్త్ లండన్ 45 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 426 పరుగులు చేసింది. ఇందులో 98 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలోని వచ్చాయి

బర్లీ పొగాకును ప్రభుత్వమే కొనాలి

- పల్నాడు ఐటిసి ప్రధాన కార్యాలయం ఎదుట దీక్షల్లో వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

బర్లీ పొగాకును మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేస్తూ పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని ఐటిసి ప్రధాన కార్యాలయం వద్ద రైతులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు ముఖ్యఅతిథిగా సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరావు హాజరై మాట్లాడారు. పొలాల్లో ఎక్కడ చూసినా పొగాకు మండెలే కనిపిస్తున్నాయని, వ్యవసాయ శాఖ మంత్రి అంగీకరించిన ప్రకారం క్వింటాలును రూ.15 వేలు చొప్పున కొనుగోలు చేయించాలని, లేదా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. నల్లబర్లీ పొగాకును టుబాకో బోర్డు పరిధిలోకి తేవాలని కోరారు. రైతులు, కౌలు రైతులకు రుణామాఫీ చేయాలంటే పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మాత్రం రూ.60 లక్షల కోట్లు రుణమాఫీ, సబ్సిడీలు ఇచ్చిందని విమర్శించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని ఐదు వేల ఎకరాల్లో పొగాకు సాగవగా 50 వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, రూ.15 వేలకు తక్కువ కొంటే గిట్టుబాటు కాదని, అలాంటిది ప్రభుత్వమే రూ.6 వేలకు కొనాలని చెప్పడం కంపెనీలకు అనుకూలంగా వ్యవహరించడమేనని తెలిపారు. పి4 ద్వారా పేదలను కోటీశ్వరులను చేస్తామని చెబుతున్న సిఎంకు రైతులు, కౌలురైతుల ఆత్మహత్యలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కడపలో జరుగుతున్న టిడిపి మహానాడులో పంటలకు మద్దతు ధరలపై తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షాపరులకు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు పూలమాలలేసి దీక్షలను ప్రారంభించారు. దీక్షల్లో రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు టి.బాబురావు, ఎఐవైఎఫ్ నాయకులు ఎస్‌కె సుభాని, కె.మల్లికార్జున, కౌలు రైతు సంఘం నాయకులు ఎస్.లూథర్, సిఐటియు నాయకులు పి.వెంకటేశ్వర్లు, ఎస్‌కె నజూరిద్దీన్, కె.భవాని, వెంకటేష్, ఆర్.నర్సిరెడ్డి, కె.స్వప్నకుమారి, జి.మురళి కూర్చున్నారు.



దీక్షల్లో రైతులు, నాయకులు

ఆర్‌బిఐ మిగులు నిధులను 'నాబార్డ్, ఉపాధి హామీ'లకు బదిలీ చేయాలి

- ఎఐకెఎస్ డిమాండ్

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరాని (2024-25) కి రికార్డు స్థాయిలో మిగులు రూ.2.69 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని ఇటీవల భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) సెంట్రల్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) తీవ్రంగా ఖండించింది. ఇలా బదిలీ చేయడం వల్ల ఈ మొత్తాలు బడా వ్యాపార, సంపన్న వర్గాలకే లబ్ధి చేకూరుస్తాయని, అలా కాకుండా వాటిని నాబార్డ్‌కు, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్)లకు అందజేయాలని ఎఐకెఎస్ కోరింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పంథాను పరిశీలించినట్లైతే ఈ బదిలీ వల్ల లాభపడేది సంపన్న వర్గాలేనని కిసాన్ సభ స్పష్టం చేసింది. వ్యవసాయ రంగాన్ని పునరుద్ధరించడానికి ఉపయోగపడేలా నాబార్డ్‌కు కొంత మిగులు మొత్తాలను బదిలీ చేయాలని అఖిల భారత నాబార్డ్ ఉద్యోగుల సమాఖ్య (ఎఐఎన్‌బిఇఎ) చేసిన విజ్ఞప్తిని కేంద్రం, ఆర్‌బిఐ తిరస్కరించిన నేపథ్యంలో ఈ విషయం స్పష్టమైందని పేర్కొంది. నాబార్డ్ చట్టం, ఆర్‌బిఐ చట్టంలోని నిబంధనలను ఉపయోగించి అసలే నిధుల లేమితో ఇబ్బందులు పడే నాబార్డ్‌కు ఈ మిగులు మొత్తాలను అందిస్తే రైతులు, వ్యవసాయ కార్మికులు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ద్వారా తీసుకునే రుణాలపై వడ్డీ మొత్తాలైనా తగ్గుతాయని ఎఐకెఎస్ పేర్కొంది. అసలే వ్యవసాయరంగ సంక్షోభంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి కొంచెం సాయమందించినట్లు వుండేదని పేర్కొంది. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం కూడా ఇలాగే నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపింది.

గ్రామీణ నిరుపేదలకు జీవనాడిగా వున్న ఈ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో కేవలం రూ.86 వేల కోట్లు కేటాయించారని, ఆ పథకానికి కొంత మిగులు మొత్తాలను కేటాయించినా కార్మికుల వేతనాలతోపాటు పని దినాలు పెరుగుతాయని పేర్కొంది. ఫలితంగా కార్మికుల కొనుగోలు శక్తి పెరుగుతుందని, అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపింది. సామ్రాజ్యవాదానికి, బడా వాణిజ్యవేత్తలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాల్సిందిగా రైతులకు, కార్మికులకు ఎఐకెఎస్ పిలుపునిచ్చింది. జులై 9నాటి అఖిల భారత సమ్మె విజయవంతానికి విస్తృత ప్రచారం చేపట్టాలని కోరింది.

సక్రమంగా పశువైద్యుల బదిలీలు

- రాష్ట్ర పశువైద్యుల అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశుసంవర్ధకశాఖలోని వైద్యుల బదిలీల ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర పశువైద్యుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ టి దామోదరనాయుడుకు, అసోసియేషన్ అధ్యక్షులు జయప్రకాష్‌తో కలిసి పలువురు నాయకులు వినతిపత్రాన్ని విజయవాడలోని కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గణేష్‌రావు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే పశువైద్యులు, సిబ్బంది బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తూ రెండేళ్లు పూర్తిచేసుకున్న వైద్యులు, సిబ్బందిని ఉత్తర్వుల్లోని నిబంధనలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియ జరగాలన్నారు. రాజకీయ నాయకుల సిఫార్సు లేఖలతో కొంత మందిని మాత్రమే బదిలీ చేసి మిగతా వారిని బదిలీ చేయకుండా నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. సిఫార్సు లేఖలతో సంబంధం లేకుండా నిబంధనలకు అనుగుణంగా ప్రతిఒక్కరినీ కౌన్సిలింగ్ విధానంలోనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ బదిలీల ప్రక్రియ సక్రమంగా జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అసోసియేషన్ ఆధ్వర్యాన ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక వ్యవస్థలో దేశాన్ని జపాన్‌తో పోల్చడం హాస్యాస్పదం

- సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 4వ స్థానానికి చేరిందని, అందుకు ప్రధాని నరేంద్ర మోడీ విధానాలే కారణమని ఎన్‌డిఎ నేతలు ఊదరగొట్టడాన్ని సిపిఐ తప్పుబట్టింది. 12 కోట్ల మంది జనాభా ఉన్న జపాన్‌తో దేశ ఆర్థిక వ్యవస్థను సరిపోల్చడం హాస్యాస్పదంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశం పోల్చుకోవాల్సింది చైనాతోనని తెలిపారు. జపాన్‌లో తలసరి ఆదాయం 39,350 డాలర్లు ఉండగా, దేశంలో తలసరి ఆదాయం 2,880 డాలర్లు మాత్రమే ఉందని, జపాన్‌తో పోటీ పడటం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. మోడీ ఏదో సాధించేసినట్లు, దేశం ఎంతో ముందుకెళ్లిపోయినట్లు ప్రజలను మభ్యపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నంలా ఉంది తప్ప మరొకటి కాదన్నారు. మోడీ ప్రధాని అయ్యేనాటికి దేశం అప్పులు రూ.84 లక్షల కోట్లు ఉండగా, ప్రస్తుతం వాటిని రూ.224 లక్షల కోట్లకు పెంచారని చెప్పారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.61 నుంచి రూ.85కు పెంచారని తెలిపారు. పదేళ్ల కిందట దేశంలో 97 మంది బిలియనీర్లు ఉండగా, నేడు ఆ సంఖ్య 210కి చేరిందన్నారు. దేశంలో బిలియనీర్ల సంఖ్య పెరిగి.. సంపదంతా కొద్దిమంది చేతుల్లోకి పోతోందన్నారు.

21 మంది హైకోర్టు జడ్జిల బదిలీ

- రాష్ట్ర హైకోర్టుకు జస్టిస్ దేవానంద్
- తెలంగాణకు మరో ముగ్గురు
- కొలిజియం సిఫార్సు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వివిధ హైకోర్టుల్లో పనిచేస్తున్న 21 మంది న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలిజియం మంగళవారం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి నేతృత్వంలోని కొలిజియం మంగళవారం సమావేశమై, బదిలీలకు లేదా యథాస్థానాలకు పంపడానికి సిఫార్సు చేసింది. ఈ వివరాలను సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. మద్రాస్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ బట్టు దేవానంద్‌ను రాష్ట్ర హైకోర్టుకు, తెలంగాణ హైకోర్టు జడ్జి సుజోయ్ పాల్‌ను కొల్‌కతా హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. కర్ణాటకలో పనిచేస్తున్న జస్టిస్ సి.సుమలత, జస్టిస్ లలిత కన్నెగంటి, పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలిజియం సిఫార్సు చేసింది. కర్ణాటక హైకోర్టు జడ్జిగా ఉన్న జస్టిస్ వి.కామేశ్వరరావు, బాంబే హైకోర్టు జడ్జి నితిన్ వాసుదేవ్ సాంబ్రేలను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. గౌహతి హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ సుమన్ శ్యామ్, ఎల్ఎస్ జమీర్, ఎం రంజన్ పాఠక్‌లను వరుసగా బాంబే, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా హైకోర్టులకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రాను పంజాబ్-హర్యానా హైకోర్టుకు, పంజాబ్-హర్యానా హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ సంజీవ్ ప్రకాష్ శర్మను రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. జస్టిస్ వివేక్ చౌదరి (అలహాబాద్ హైకోర్టు)ను ఢిల్లీ హైకోర్టుకు, జస్టిస్ దినేష్ కుమార్ సింగ్ (కేరళ)ను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని కోరింది. జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ (మద్రాస్ హైకోర్టు)ను మధ్యప్రదేశ్‌కు, జస్టిస్ ఓం ప్రకాష్ శుక్లా (అలహాబాద్)ను ఢిల్లీకి బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. జస్టిస్ చంద్రశేఖర్ (రాజస్థాన్ హైకోర్టు)ను బాంబేకు, జస్టిస్ సుధీర్ సింగ్ (పంజాబ్-హర్యానా)ను పాట్నాకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. పంజాబ్-హర్యానా హైకోర్టులో పని చేస్తున్న జస్టిస్ అనిల్ క్షేత్రపాల్‌ను, జస్టిస్ అరుణ్ కుమార్ మోంగా (రాజస్థాన్)ను ఢిల్లీ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ జయంత్ బెనర్జీని కర్ణాటకకు బదిలీ చేయాలని కొలిజియం సిఫార్సు చేసింది.

వైద్యారోగ్యశాఖలో బదిలీల నిబంధనలకు సడలింపు

- పాలనా సిబ్బందికి మూడేళ్లు
- పూర్తయితే బదిలీ తప్పనిసరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యారోగ్యశాఖలో సాధారణ బదిలీల విధి విధానాలకు సంబంధించి పలు సడలింపులను ప్రభుత్వం ఆమోదించింది. రీజనల్ డైరెక్టర్లు, డిఎంహెచ్ఒ, డిసి అండ్ హెచ్ఎస్‌ల కార్యాలయాలతోపాటు వైద్య కళాశాలల ప్రిన్సిపల్స్, ఆస్పత్రుల సూపరింటెండెంట్ల కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పాలనా సిబ్బందిపై పలు ఆరోపణల నేపథ్యంలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన పాలనా సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, అకౌంటెంట్లు, మేనేజర్లు తదితర పాలనా సిబ్బందిపై ఏళ్ల తరబడి పలు ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. వివిధ ఉద్యోగ సంఘాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సిబ్బందిని అదే స్టేషనల్లో మరొక కార్యాలయానికి బదిలీ చేయనున్నట్లు తెలిపింది. ఇక ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపల్స్, అనుబంధ బోధానాస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రభుత్వ స్పెషాలిటీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, సీనియర్ డాక్టర్లు, అడిషనల్ డైరెక్టర్ల విషయంలో పనితీరు ఆధారంగా పాలనా అవసరాల మేరకు ఐదేళ్ల సర్వీసు పూర్తి కానున్నప్పటికీ బదిలీలు చేపట్టనున్నారు. సడలింపుల్లో భాగంగా వైద్యారోగ్యశాఖలో ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తి చేసినవారు మాత్రమే బదిలీలను కోరే అవకాశం ఉందన్నారు. డిఎంఇ ఆధీనంలో ఉంటే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో జాతీయ వైద్య సంఘం (ఎన్ఎంసి) నిబంధనల మేరకు ఉన్న ఖాళీలనే ప్రకటించి ప్రస్తుత బదిలీలతో వాటిని భర్తీ చేస్తారు.

డిప్యూటేషన్‌పై పని చేస్తున్న వారి సీనియారిటీ, ఏ కార్యాలయం నుంచి జీతభత్యాలు తీసుకుంటున్నారో అక్కడ పనిచేసినప్పటి నుంచి పరిగణనలోకి తీసుకుంటారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి ఉద్యోగి బదిలీని కోరుతూ మూడు స్థానాన్ని ప్రాధాన్యత క్రమంలో సూచించాల్సి ఉందని పేర్కొంది. ఒకే పోస్టును ఎక్కువ మంది కోరితే సీనియార్టీ ప్రకారం నిర్ణయం తీసుకుటారంది. ఇతర కేటగిరీలకు సంబంధించి ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని బదిలీ చేయనున్నట్లు పేర్కొంది. బదిలీల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభించగా, 20 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉందని వెల్లడించింది.

గ్రామ సర్వేయర్లను రెవెన్యూశాఖలోనే కొనసాగించాలి

- బొప్పరాజు విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ సర్వేయర్లను రెవెన్యూశాఖలోనే కొనసాగించాలని ప్రభుత్వానికి ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోన ఆంజనేయకుమార్, జి అనపమ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు యూనియన్ ప్రతినిధులు మంగళవారం గ్రామ, వార్డు సచివాలయశాఖ ప్రభుత్వ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉగ్రవాదమే పాక్ వ్యూహం : ప్రధాని మోడీ

గాంధీనగర్ : ఉగ్రవాదమే పాకిస్తాన్ యుద్ధ వ్యూహమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ విమర్శించారు. భారత్‌కు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం నుంచి పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుండటాన్ని పరోక్ష యుద్ధంగా భావించకూడదని, అది పాకిస్తాన్ నిరంతర సైనిక వ్యూహంగానే భావించాలని అన్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన గుజరాత్ ప్రభుత్వ పట్టణాభివృద్ధి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీమాంతర ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాకిస్తాన్ ఉగ్రదాడులతో భారత్‌లో అలజడి సృష్టించాలని చూస్తే మౌనంగా ఉండబోమని హెచ్చరించారు. పాక్‌లో ఉగ్రవాదుల అంత్యక్రియలు పభుత్వ లాంఛనాలతో జరిపించారని, ఆ దేశ ఆర్మీ వారికి సెల్యూట్ చేసిందని, ఇదంతా పాకిస్థాన్ యుద్ధ వ్యూహమని రుజువు చేస్తోందని అన్నారు. 1947లో భారత్ విభజన జరిగినప్పుడు సాయుధ మూకల సాయంతో కాశ్మీర్‌లోని కొంత భాగాన్ని పాక్ ఆక్రమించుకుందని, అప్పట్లోనే వారిని ఏరివేసి కాశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్న వల్లభాయ్ పటేల్ సలహా విని ఉంటే.. భారత్‌లో ఉగ్రదాడులు ఉండేవి కాదని అన్నారు. దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని ప్రజలు తగ్గించుకోవాలని అన్నారు.

'సిఎంఒ'లోకి కృష్ణచైతన్య, మీనా, యువరాజ్!

- త్వరలోనే పోస్టింగ్‌లు, ఫైల్ సిద్ధం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం కొలువుతీరి ఏడాది కావస్తున్న నేపథ్యంతో తన కార్యాలయాన్ని బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించుకున్నారు. దీనికోసం కొంతమంది ఐఎఎస్ అధికారులను పేషీలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. ఉన్నవారిలో పనిభారం ఎక్కువగా ఉండడం వల్ల యువ ఐఎఎస్ అధికారులకు పేషీలో చోటు కల్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రధానంగా కర్ణాటక నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన కృష్ణ చైతన్య ప్రస్తుతం అటవీ శాఖలో పనిచేస్తున్నారు. ఆయనను ముఖ్యమంత్రి పేషీలో చేర్చుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. అలాగే సాధారణ పరిపాలనశాఖలో ఉన్న మీనాను, పరిశ్రమలశాఖ కార్యదర్శిగా ఉన్న యువరాజ్‌ను కూడా పేషీలో భాగస్వామ్యులను చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన దస్త్రాలు కూడా ఇప్పటికే సిద్ధం చేశారని తెలిసింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి పేషీలో కీలక అధికారిగా ముద్దాడ రవిచంద్ర వ్యవహరిస్తుండగా, మరో సీనియర్ అధికారి సాయిప్రసాద్, రాజమౌళి, ప్రద్యుమ్న, కార్తికేయ మిశ్రా ఇప్పటికే పనిచేస్తున్నారు. కొత్తగా చైతన్య, మీనా, యువరాజ్‌ను తీసుకొస్తే, ఇప్పుడు ఉన్నవారిలో ఎవరిని తప్పిస్తారన్నది ప్రశ్నార్థకంగా ఉంది.



క్లాస్ ఎగ్గొడితే అమెరికా వీసా రద్దు !

- హెచ్చరించిన ఇండియన్ ఎంబసీ

న్యూఢిల్లీ : ముందుగా కాలేజీ యాజమాన్యానికి తెలియజేయకుండా తరగతులు ఎగ్గొట్టినా లేక చదువును విడిచిపెట్టినా విద్యార్థి వీసా రద్దయ్యే అవకాశం వుందని భారత్‌లోని అమెరికన్ ఎంబసీ అమెరికాలో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థులను మంగళవారం హెచ్చరించింది. ఈ మేరకు ఎంబసీ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. వీసా షరతులు, నిబంధనలకు కట్టుబడి వుండాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థి జీవితాన్ని కొనసాగించాలని కోరింది. పైన పేర్కొన్న వాటిల్లో ఏది చేసినా భవిష్యత్తులో అమెరికా వీసా వచ్చే అర్హత కూడా పోగొట్టుకోవచ్చని హెచ్చరించింది. అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో పెద్ద సంఖ్యలో భారతీయ విద్యార్థులు చదువుతుంటారు. 2023లో భారత్‌లోని అమెరికా కాన్సులార్ బృందం 1,40,000కి పైగా విద్యార్థి వీసాలను జారీ చేసి, వరుసగా మూడో ఏడాది రికార్డు సృష్టించింది. మరే ఇతర దేశం కన్నా ఈ వీసాలు ఎక్కువ. అదే ఏడాది భారత్‌లోని అమెరికన్ మిషన్ 14లక్షలకు పైగా వీసాలను ప్రాసెస్ చేసింది.

50 వేల పంట కుంటల నిర్మాణం పూర్తి

- పిఆర్అండ్ఆర్‌డి కమిషనర్ కృష్ణ తేజ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 1.55 లక్షల పంట కుంటల నిర్మాణంలో ఇప్పటి వరకూ 50 వేలు పూర్తి చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎంవిఆర్ కృష్ణ తేజ తెలిపారు. వీటి నిర్మాణంలో మొదటి మూడు స్థానాల్లో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అన్నమయ్య జిల్లాలు నిలిచినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట కుంటల గట్ల వెంబడి దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే బొప్పాయి, అరటి, జామ, కరివేపాకు వంటి మొక్కలను నాటుకోవచ్చని, మందుల పిచికారికి ఈ నీటిని వాడుకోవచ్చని, ఆసక్తి ఉన్న రైతులు చేపలు కూడా పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పడుతున్న వర్షాల నేపథ్యంలో పంట కుంటల చుట్టూ వేసిన మట్టి కట్టలపై ఆకు కూరలు, కూరగాయలు పండించుకుని ఆదనపు ఆదాయాన్ని పొందాలని రైతులకు ఆయన సూచించారు. ఆకు కూరలు, కూరగాయల విత్తనాలకు అయ్యే ఖర్చును పని అంచనాలో చేర్చి ఉపాధి హామీ నిధులతో రైతులకు చెల్లిస్తామన్నారు.

సావర్కర్‌పై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : వి.డి. సావర్కర్ విషయంలో వున్న తప్పుడు అవగాహనలను ఆపేందుకు కొన్ని చారిత్రక వాస్తవాలను వెలుగులోకి తేవడానికి కోర్టు తనను అనుమతించాలని కోరుతూ ఫడ్నవిస్ అనే వ్యక్తి సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను కోర్టు మంగళవారం తిరస్కరించింది. రాజ్యాంగం కింద ఆయన ప్రాథమిక హక్కులేమైనా ఉల్లంఘించబడ్డాయా, అందువల్లే సుప్రీంకోర్టును ఆశ్రయించారా అని బెంచ్ పిటిషనర్‌ను ప్రశ్నించింది. సావర్కర్‌పై ఇటీవల రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ప్రతిపక్ష నేత తన ప్రాథమిక విధులను అడ్డగించలేరని ఫడ్నవిస్ వాదించారు. దానిపై బెంచ్ స్పందిస్తూ, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి తగిన కారణం తమకు కనిపించడం లేదని పేర్కొంటూ జస్టిస్ గవాయ్ పిటిషన్‌ను కొట్టివేశారు.



పరస్పర సహకారం, సమన్వయం అవశ్యం

- ట్రంప్ టారిఫ్‌ల నుండి రక్షణకు చర్యలు
- ఆసియాన్, జిసిసి, చైనా సదస్సులో నేతల పిలుపు

కౌలాలంపూర్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించే అధిక టారిఫ్‌ల ప్రభావం నుండి తప్పుకునేందుకు, తమ వాణిజ్య ఆధారిత ఆర్థిక వ్యవస్థలకు రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆసియాన్ దేశాల నేతలు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఆసియాన్ వార్షిక సదస్సు రెండో రోజైన మంగళవారం నాడు ఆసియాన్ నేతలు చైనాతో, గల్ఫ్ సహకార మండలి (జిసిసి)నేతలతో సమావేశమయ్యారు. ఆసియాన్‌కు ప్రస్తుతం అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఆసియాన్ - జిసిసి సదస్సును ప్రారంభిస్తూ, ఈ రెండు గ్రూపుల మధ్య పటిష్టమైన సంబంధాలు సహకారాన్ని పెంచుకోవడానికి, ఎదురు దెబ్బలు తగిలినా తిరిగి కోలుకోవడానికి, సుస్థిరమైన సంక్షేమాన్ని సాధించడానికి చాలా కీలకమని వ్యాఖ్యానించారు. రోజురోజుకు మరింత సంక్లిష్టమవుతున్న ప్రపంచంలో ఆర్థిక అనిశ్చితి పెరిగిపోతోందని, భౌగోళిక, రాజకీయ సవాళ్లు పెరిగిపోతున్నాయని, అటువంటి పరిస్థితుల్లో ఆసియాన్ - జిసిసి భాగస్వామ్యానికి ప్రాముఖ్యత గతంలో ఎన్నడూ లేనంతగా వుందన్నారు. వాణిజ్య టారిఫ్‌లపై అమెరికాతో కుదుర్చుకునే ఏ ద్వైపాక్షిక ఒప్పందాలైనా అవి పరస్పర ఆర్థిక వ్యవస్థలను దెబ్బ తీసేవిగా వుండరాదని ఒక అవగాహనకు వచ్చినట్లు అన్వర్ తెలిపారు.

సోమవారం కౌలాలంపూర్ చేరుకున్న చైనా ప్రధాని లీ కియాంగ్ మంగళవారం ఆసియాన్, జిసిసి సమావేశంలో పాల్గొన్నారు. చైనా, ఆసియాన్, జిసిసి మధ్య వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలు మరింత విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకపక్షవాదం, రక్షణ వాదం పెరిగిపోతున్న వేళ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంతో సాగుతున్న తరుణంలో చైనా, ఆసియాన్, జిసిసి దేశాలు పరస్పరం సమన్వయాన్ని బలోపేతం చేసుకోవాల్సి వుందని లీ పిలుపిచ్చారు.

బెంగళూరు జైలుకు గాలి జనార్ధన్ తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసు దోషి గాలి జనార్ధన్ రెడ్డిని మంగళవారం బెంగళూరుకు తరలించారు. ఈ కేసులో ఆయన ప్రస్తుతం చంచల్ గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. గాలి జనార్ధన్ రెడ్డిపై గతంలో బెంగళూరులో పలు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయనను కోర్టులో హాజరుపర్చేందుకు బెంగళూరు పోలీసులు పిటి వారెంట్ తీసుకుని మంగళవారం చంచల్‌గూడ జైలుకు వచ్చారు. పటిష్ట భద్రత నడుమ ప్రత్యేక వాహనంలో బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలుకు తరలించారు. ఒఎంసి కేసులో గాలి జనార్ధన్ రెడ్డితో పలువురికి నాంపల్లి సిబిఐ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. సిబిఐ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ గాలి జనార్ధన్ రెడ్డి సహా నలుగురు తెలంగాణ హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం దీనిపై హైకోర్టులో విచారణ జరుగుతోంది.

అమృత్‌సర్‌లో బాంబు పేలుడు

- ఖలిస్తానీ తీవ్రవాది మృతి!

అమృత్‌సర్ : పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో మంగళవారం జరిగిన బాంబు పేలుడులో అనుమానాస్పద ఖలిస్తానీ తీవ్రవాది మృతి చెందాడు. నగరంలోని మజితా రోడ్డు బైపాస్‌లో ఒక ఖాళీ ప్రాంతం వద్ద మంగళవారం ఉదయం దాదాపు 9:30 గంటలకు ఈ పేలుడు సంభవించింది. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (బోర్డర్ రేంజ్) సతీందర్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ మరణించిన వ్యక్తికి బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బికెఐ) సంస్థతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్నట్లు చెప్పారు. అతను ఎవరనేది ఇంకా గుర్తించలేదని తెలిపారు. పేలుడు పదార్థాన్ని తిరిగి పొందడానికే ఆ వ్యక్తి అక్కడకు వచ్చాడని, అతని చేతుల్లోనే పేలిపోయిందని పేర్కొన్నారు.

ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా ఎదుర్కోవాలి

(మొదటి పేజీ తరువాయి)

మరింత రెచ్చగొడుతున్నారని అన్నారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న పవన్ ఇలా మాట్లాడటం నేరమని తెలిపారు. లౌకికపార్టీ అని చెప్పుకుంటున్న టిడిపి కూడా దీనికి సమాధానం చెప్పాలన్నారు. సిపిఎం దేశంలో సమైక్యతకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపేస్తున్నారని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. బిజెపి నాయకుల తీరు అత్యంత దారుణంగా ఉందని అన్నారు. సైనికులు, ప్రజలు మోడీ కాళ్లకు దండం పెట్టాలని చెబుతున్నారని ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని అన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన నాయకులు మోడీ భజన చేయడంలో మునిగిపోయారని తెలిపారు. సభకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీదేవి, విజయవాడ కార్పొరేషన్ సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యం కోసం మహానాడులో తీర్మానం చేయాలి

లౌకిక పార్టీగా చెప్పుకునే టిడిపి.. బిజెపి పిలుపునిచ్చిన తిరంగా యాత్రలో పాల్గొందని, ఇంతకంటే సిగ్గుచేటైన విషయం మరొకటి లేదని వి శ్రీనివాసరావు విమర్శించారు. ప్రస్తుతం కడపలో జరుగుతున్న టిడిపి మహానాడులో లౌకికవాదం, మత సామరస్యం కోసం తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ స్ఫూర్తిని నిలబెట్టాలని కోరారు.

ఆపరేషన్ సిందూర్‌పై పోస్ట్ పెడితే...

క్రిమినల్‌లా చూస్తారా?

- మహారాష్ట్ర ప్రభుత్వంపై బాంబే హైకోర్టు ఆగ్రహం
- ఆమె జీవితాన్ని నాశనం చేస్తారా అంటూ పూణే కళాశాలకు మందలింపు



ముంబయి : ఇటీవల భారత్, పాక్‌ల మధ్య జరిగిన ఘర్షణలపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన కాలేజీ యువతిని ఈ నెల ఆరంభంలో అరెస్టు చేయడంపై బాంబే హైకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక విద్యార్థి జీవితంతో ఎలా ఆటలాడుకుంటారని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆ పోస్టులో ఆమె స్పందన 'రాడికల్' గా వుందని పేర్కొంటూ పూనేకు చెందిన 19ఏళ్ల విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం ఇంత తీవ్రంగా స్పందించరాదని జస్టిస్ గౌరి గాడ్సే, జస్టిస్ సోమశేఖర్ సుందరేశన్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ పేర్కొంది. వెంటనే బెయిల్ మంజూరు చేసేందుకు వీలుగా తక్షణమే బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేయాల్సిందిగా ఆ యువతి తరపు న్యాయవాదిని ఆదేశించింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో వున్న ఆ యువతి తనను కాలేజీ నుండి బహిష్కరించాలన్న తన కాలేజీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది. "ఆ యువతి ఏదో పోస్టు చేసింది, తర్వాత తన తప్పును గ్రహించింది, క్షమాపణలు చెప్పింది. ఆమె మారడానికి ఒక అవకాశం ఇవ్వాల్సింది పోయి, రాష్ట్రప్రభుత్వం ఆమెను అరెస్టు చేసి, ఆమెను ఒక క్రిమినల్‌గా మార్చింది." అని బెంచ్ వ్యాఖ్యానించింది. ప్రభుత్వం, కాలేజీ వ్యవహరించిన తీరును కోర్టు ప్రశ్నించింది. "ఒకరు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అందుకని ఆమె జీవితాన్ని మీరు ఇలా నాశనం చేస్తారా? ఒక విద్యార్థి జీవితంతో ఆడుకుంటారా?" అని ప్రశ్నించింది. ఆమె పోస్టు జాతీయ ప్రయోజనాలకు భంగకరంగా వుందని అదనపు ప్రభుత్వ న్యాయవాది కాకడే పేర్కొన్నారు. ఒక విద్యార్థి పెట్టిన ఒక పోస్టుతో జాతీయ ప్రయోజనాలకేమీ భంగం వాటిల్లదని కోర్టు పేర్కొంది. విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడాన్ని ఆపేయాలని ఈ ప్రభుత్వం కోరుకుంటోందా అని కోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం ఇంత తీవ్రంగా ప్రతిస్పందించడం వల్ల ఆ వ్యక్తి కూడా తీవ్ర స్థాయిలోనే మారతాడని కోర్టు వ్యాఖ్యానించింది. పూణే కాలేజీ యాజమాన్యాన్ని కూడా బెంచ్ మందలించింది. ఆ విద్యార్థిని శిక్షించడానికి బదులుగా సంస్కరించాలని పేర్కొంది.

జులై 9 సమ్మెకు

వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల మద్దతు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జులై 9న జరిగే కేంద్ర కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెకు అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు ఇచ్చాయి. మంగళవారం నాడిక్కడ అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల నేతలు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) నుంచి బి వెంకట్, విక్రమ్ సింగ్, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) నుంచి గుల్జార్ సింగ్ గోరియా, నిర్మల్, ఎఐఎఆర్ఎల్ఎ నుంచి నివాస్, ప్రసేంజిత్ కుమార్, అఖిల భారత వ్యవసాయ కూలీల సంఘం (ఎఐఎస్‌కెఎస్) నుంచి ఆసిత్ గంగూలీ తదితరులు పాల్గొన్నారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో పెద్దయెత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)తో సమన్వాయం చేసుకుని జులై 9న దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో 1,000 తాలూకా, మండల్, సబ్ డివిజనల్ స్థానికంగా లక్షల మందితో భారీ ఉద్యమాలు చేయాలని నిర్ణయించారు. బిజెపి ప్రభుత్వ కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలను ఎదుర్కొనడమే లక్ష్యంగా ఈ ఆందోళన జరగనుందని నేతలు పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయ కార్మికుల, గ్రామీణ పేదల శ్రమను కార్పొరేట్ లాభాల కోసం తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. 2014 నుంచి అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం పరిశ్రమలతో పాటు వ్యవసాయ రంగంలోనూ అనేక ప్రతికూలమైన విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. కోవిడ్ సమయంలో ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ చట్టాలు, కార్మిక కోడ్‌లు వంటి చర్యలు ప్రజా వ్యతిరేకమైనవని అన్నారు. చరిత్రాత్మక ఉద్యమంతో మోడీ ప్రభుత్వం నల్ల రైతు చట్టాలను పక్కన పెట్టి దొడ్డిదారిన మరో రూపంలో అమలుకు పూనుకుంటుందని దుయ్యబట్టారు.

కార్మిక కోడ్‌లతో కార్మికుల హక్కులు కాలరాసి, పారిశ్రామిక యజమానులకు అధికారాలు ఇవ్వడమని విమర్శించారు. గ్రామీణ ఉపాధిని పటిష్టం చేయడానికి బదులు నిధులు పెంచకుండా ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. పని దినాలను 200కు పెంచాలన్న డిమాండ్‌ను పట్టించుకోవటం లేదని, అలాగే రోజుకు రూ.600గా ఇవ్వాలనే డిమాండ్‌ను పట్టించుకోలేదని అన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీనే 150 రోజులు పని కల్పించాలని, వేతనం పెంచాలని చెప్పినప్పటికీ, మోడీ సర్కార్ వీటిని అటకెక్కించిందన్నారు. గ్రామీణ ఉపాధి, ఆహార భద్రత, గృహ హక్కు, విద్యుత్ ప్రైవేటీకరణ వ్యతిరేకత, దళిత, ఆదివాసీ, మహిళా హక్కులు, వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర చట్టం, కౌలు రైతులకు గుర్తింపు, మద్దతు ధర, గిరాకీ ధరలతో కూడిన రాయితీలు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లతో గ్రామీణ పేదలు జులై 9న నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.

జులై 9న సమ్మెకు ప్రధాన డిమాండ్లు

1. ఉపాధి బలోపేతం : రూ.2.5 లక్షల కోట్ల బడ్జెట్, 200 రోజులు పని, వేతనం రూ.600
2. జనభద్రత కోసం ఆహార భద్రత : ప్రతి ఒక్కరికీ 10 కిలోల బియ్యం, నాణ్యమైన నిత్యావసరాలు, డిలీట్ రేషన్ కార్డుల పునరుద్ధరణ
3. భూమి, నివాస హక్కు : భూమిలేని రైతులకు భూమి, నిర్బంధ భూ స్వాధీనం నిషేధం
4. విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా : గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల తొలగింపు, ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలి
5. దళిత, ఆదివాసీ, మహిళల హక్కులకు రక్షణ : మనువాదాన్ని తిరస్కరించండి, హిందూత్వ భావజాలాన్ని తూర్పారబెట్టండి
6. వ్యవసాయ కార్మికుల కోసం కేంద్ర చట్టం : సామాజిక భద్రత, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం
7. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : కనిష్ట వేతనం రూ.26,000, ఒప్పందం, పథకాల కార్మికుల పరిపాలన
8. ఎంఎస్‌పి హామీ, రాయితీలు : రైతులకు గ్యారంటీ కలిగిన మద్దతు ధర, ఉచిత రుణాలు, వ్యవసాయ పరికరాలకు రాయితీలు
9. భూమి లేని రైతులకు గుర్తింపు : భూదారులుగా గుర్తించి, వారికి సామాజిక భద్రత, బ్యాంకు రుణాలు
10. ప్రతి పౌరుడికి రూ.10,000 కనీస భద్రత : నెలకు కనీస ఆదాయ భద్రతగా అమలు చేయాలి

భారత్‌తో శాంతి చర్చలకు సిద్ధమన్న పాక్ ప్రధాని

టెహరాన్ : భారత్‌తో శాంతి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని, కాశ్మీర్, నీటి సమస్యలతో సహా అన్ని వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నామని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పారు. వాణిజ్యం, ఉగ్రవాదంపై కూడా చర్చించాలనుకుంటున్నట్లు తెలిపారు. నాలుగు దేశాల పర్యటనలో భాగంగా టర్కీ నుండి ఇరాన్ రాజధాని టెహరాన్ చేరుకున్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టెహరాన్‌లో గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషికాన్‌తో చర్చలు జరిపారు. అనంతరం ఆయనతో కలిసి పత్రికా సమావేశంలో పాల్గొన్న షరీఫ్ శాంతి కోసం భారత్‌తో చర్చలకు సిద్ధమని చెప్పారు. ఒకవేళ భారత్ యుద్ధానికే సిద్ధమైతే తాము కూడా తమ దేశాన్ని రక్షించుకోవడానికి సిద్ధమేనని తెలిపారు. శాంతిని కోరుకుంటున్నామన్న మా ప్రతిపాదనను అంగీకరిస్తే మేం నిజాయితీగా, సీరియస్‌గా శాంతిని కోరుకుంటున్నామని వారికి చూపిస్తామని అన్నారు. పాక్, ఇరాన్ ప్రతినిధి బృందాలు అర్థవంతమైన చర్చలు జరిపాయని, పరస్పర ప్రయోజనాలు కలిగిన రంగాల్లో సహకారంపై చర్చించాయని చెప్పారు.

ప్రతి జిల్లాలో హాల్‌మార్కింగ్ కేంద్రాలు

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతి జిల్లాలో హాల్‌మార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం నాడిక్కడ జరిగిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014-15లో భారత్‌లో కేవలం 2 వేలకు స్టాండర్డ్స్ మాత్రమే ఉన్నాయని, 2025 నాటికి ఈ సంఖ్య 23 వేలకు చేరిందని అన్నారు. ప్రమాణీకరణ సంఖ్యను 55 వేల వరకు పెంచడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమన్నారు. భారత్ తయారుచేసిన స్టాండర్డ్స్ 95 శాతం హార్మొనైజ్డ్‌గా గుర్తింపు పొందాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమన్వయం చేయబడ్డాయని, భారత స్టాండర్డ్‌లు ఇప్పుడు ప్రపంచ ప్రామాణికంగా మారుతున్నాయని తెలిపారు. హాల్‌మార్కింగ్ విషయంలో గణనీయమైన అభివృద్ధి జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు 371 జిల్లాల్లో బంగారం హాల్ మార్కింగ్ అమలులో ఉందన్నారు. దేశ వ్యాప్తంగా విస్తరణలో భాగంగా ప్రతి జిల్లాలో హాల్‌మార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వెండి ఆభరణాల కోసం విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. త్వరలో వెండి ఆభరణాలపై హాల్ మార్కింగ్ కోసం విధాన ప్రకటన చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతుందన్నారు.

మావోయిస్టుల మృతదేహాల దహనంపై న్యాయ విచారణ

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్‌కౌంటర్లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా మరో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను దహనం చేయడంపై న్యాయ విచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించకుండా ఉద్దేశపూర్వకంగా పోలీసులు దహనం చేయడాన్ని ఖండించారు. నారాయణపూర్‌లో బంధువులు మృతదేహాలు అప్పగిస్తారని రోజులుగా పడిగాపులు కాస్తున్నా, బంధుమిత్రులకు మృతదేహాలు అప్పగిస్తామని చత్తీస్‌గఢ్ హైకోర్టుకు అడ్వకేట్ జనరల్ హామీ ఇచ్చినా అయినవారు లేరని ఏకపక్షంగా మృతదేహాలను దహనం చేయడం వెనుక అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. దీనిపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ ప్రకటించిందని, పౌరహక్కుల సంఘాలు, రాజకీయ పార్టీలు చర్చలు జరపాలని ప్రభుత్వాలను కోరాయని పేర్కొన్నారు. అయినా ఎన్‌కౌంటర్ పేరుతో మావోయిస్టులను హత్య చేయడం దుర్మార్గమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని కోరారు. ఇదే అంశంపై మంగళవారం ఉదయం లెనిన్ సెంటర్లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో శ్రీనివాసరావు మాట్లాడారు.

కోర్టు ధిక్కార కేసు నమోదు

ప్రజాశక్తి-అమరావతి

మావోయిస్టు పార్టీ నేతలు నంబాల కేశవరావు, సజ్జా నాగేశ్వరరావు మృతదేహాలను బంధువులకు అప్పగిస్తామని చత్తీస్‌గఢ్ ఎజి రాష్ట్ర హైకోర్టు బెంచ్ ఎదుట శనివారం హామీ ఇచ్చి ఆ తర్వాత ఇవ్వడానికి నిరాకరించారని హైకోర్టులో కోర్టు ధిక్కార కేసు నమోదైంది. ఈ మేరకు కేశవరావు తల్లి భారతమ్మ, అన్నయ్య ఢిల్లీశ్వరరావు తరపున పౌరహక్కుల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ గురువారం విచారణకు రానుంది. ప్రతివాదులుగా చత్తీస్‌గఢ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అమితాబ్ జైన్, ఆ రాష్ట్ర డిజిపి అరుణ దేవ్ గౌతమ్, బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజ్‌ను చేర్చారు.

చెదురుమదురుగా భారీ వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చెదురుమదురుగా భారీ వర్షాలతో పాటు కొన్నిచోట్ల 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, ఏలూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 29న పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మంగళవారం సాయంత్రానికి అనకాపల్లి జిల్లా పాములవాకలో 46.5 మిల్లీమీటర్లు, నరసింగపల్లిలో 41.2 మిల్లీమీటర్లు, యలమంచిలిలో 40.7 మిల్లీమీటర్లు, అల్లూరి జిల్లా అనంతగిరిలో 37.5 మిల్లీమీటర్లు, అనకాపల్లిలో 29 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైందని తెలిపారు.

నారాయణపూర్‌లో హైడ్రామా

(మొదటిపేజీ తరువాయి)

కేశవరావు సోదరుడు రాంప్రసాద్ ఒక అర్జీ పెట్టుకున్నట్లుగా పోలీసులు ఓ లేఖను సిద్ధం చేశారు. కేశవరావుకు సంబంధించి ఎటువంటి లీగల్ డాక్యుమెంట్లు అందించలేదంటూ అందులో పొందుపరిచారు. కేశవరావు మరణించి చాలా రోజులైనందున మృతదేహం కుళ్లిపోవడంతో మహమ్మారి వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పోలీసులే దహన సంస్కారాలు చేశారని రాంప్రసాద్ అంగీకరించినట్లు అందులో పేర్కొన్నారు. దీంతోపాటు ఆయన చితాభస్మం, అస్తికలు అడిగినట్లుగా కోరుతూ వినతిపత్రం రాసినట్లు సిద్ధం చేసి వారితో సంతకం చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. తమ వారితో సంప్రదిస్తామంటూ ఫోన్ చేసేందుకు బయటకు వచ్చినట్లే వచ్చి వారు ఉంటున్న రూమ్‌కు వెళ్లిపోయారు. ఇంతలో రెండు జీపుల్లో పోలీసులు వారు ఉంటున్న గది వద్దకు చేరుకున్నారు. వారిని బయటకు పిలిచి వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో అక్కడకు కొందరు జర్నలిస్టులు వచ్చి పోలీసుల ప్రయత్నాలను నిలదీశారు. ఈ క్రమంలో జర్నలిస్టుల సాయంతో తమ వాహనాన్ని ఎక్కి వేరే మార్గంలో శ్రీకాకుళం బయలు దేరారు.


प्रति,
थाना प्रभारी महोदय
थाना कोतवाली, जिला नारायणपुर (छ.ग.)

विषय - नंबाला केशव राव उर्फ बसव राजू के अस्थि प्राप्त करने के संबंध में।

महोदय,

मै रामप्रसाद पिता स्व. वासुदेव राव उम्र 61 वर्ष पता- जेनपेट्टा श्रीकाकुलम आन्ध्रप्रदेश का निवासी हूं। हमने कोई वैध दस्तावेज नही दे पाये इसलिए हमें सुपुर्दनामा में नंबाला केशव राव उर्फ बसव राजू का शव नही दिया गया। चूंकि शव को काफी दिन हो गया था, महामारी फैलने की आशंका पर जिला एवं पुलिस प्रशासन द्वारा उसका अंतिम-संस्कार किया गया। मैं उसकी आत्मा की शांति के लिए चिताभस्म को अपने गांव जेनपेट्टा श्रीकाकुलम आन्ध्रप्रदेश ले जाना चाहता हूं।

कृपया हमे नंबाला केशव राव उर्फ बसव राजू के आत्मा की शांति के लिए उसके शव का चिताभस्म प्रदाय करने की कृपा करें।

प्रार्थी
रामप्रसाद
पता- जेनपेट्टा श्रीकाकुलम आन्ध्रप्रदेश
मो.न. 9440596775

నారాయణపూర్ పోలీసులు తయారు చేసిన అర్జీ

కుట్ర బయటపడుతుందనే మృతదేహాలు అప్పగించలేదు
నంబాల కేశవరావు సోదరుడు ఢిల్లీశ్వరరావు


నంబాల కేశవరావు, ఇతర సభ్యుల ఎన్‌కౌంటర్ కుట్ర బయట పడుతుందనే తమకు మృతదేహాలను అప్పగించలేదని కేశవరావు సోదరుడు ఢిల్లీశ్వరరావు తెలిపారు. తన సోదరుడిని పోలీసులు పట్టుకుని కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము రీ పోస్టుమార్టం కోరతామని వారు అంచనా వేశారని, అందులో నిజానిజాలు బయటపడతాయన్న భయంతోనే పథకం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు మృతదేహాలు ఇవ్వకుండా నాటకం ఆడాయన్నారు. తమకు మృతదేహం దక్కకుండా చేయడంలో టిడిపి కూటమి ప్రభుత్వం హస్తం ఉందని ఆయన ఆరోపించారు. కేశవరావు మృతదేహం కోసం ఎందుకు వెళ్లావంటూ తమ కుటుంబ సభ్యుడైన రాజశేఖర్‌ను జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సైతం ఫోన్‌లో బెదిరించారని వాపోయారు. పోలీసు కేసుల్లో ఇరుక్కుంటావంటూ హెచ్చరించారని ఆయన మీడియాకు తెలిపారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న శోభన, మంద కృష్ణ మాదిగ

68 మంది ప్రముఖులకు 'పద్మ' పురస్కారాల ప్రదానం


న్యూఢిల్లీ : 'పద్మ' అవార్డుల రెండో విడత ప్రదానోత్సవం మంగళవారం ఢిల్లీలో ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో సేవలందించిన 68 మందికి ఈ ప్రతిష్టాత్మమైన పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జగదీష్ సింగ్ ఖేహార్, నృత్యకారిణి శోభన చంద్రకుమార్, కన్నడ నటుడు అనంత్ నాగ్, కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సోనియా నిత్యానంద్ సహా 68 మంది ప్రముఖులకు రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, రాఘవేంద్రాచార్య పంచముఖి, ప్రొఫెసర్ కెఎల్ కృష్ణ రాష్ట్రపతి చేతుల మీదగా అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ పౌర పురస్కారాలు అయిన పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ వార్డుల కోసం 139 మంది ప్రముఖుల పేర్లు ప్రకటించారు. తొలి విడతగా ఏప్రిల్ 28న 71 మందికి అవార్డులు అందజేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి



అందమైన ప్రకృతి
ఆనందాల ప్రకృతి
అద్భుతమైన ఆలోచనల ఆకృతి
సహజమైనది ప్రకృతి
అనంతమైనది ప్రకృతి
మెరిసే మేఘం ప్రకృతి
కురిసే వాన ప్రకృతి
విరిసే పువ్వు ప్రకృతి
అందమైన నీలి ఆకాశం ప్రకృతి
సెలయేటి గలగలలు ప్రకృతి
కిలకిలమనే పక్షులు ప్రకృతి
మనిషి మనుగడకు మూలం ప్రకృతి
ప్రకృతియే మన సర్వస్వం
ప్రకృతియే మన జీవనాడి
ప్రకృతి లేని నాడు బతుకే లేదు
ప్రకృతిని ప్రేమించండి
పర్యావరణాన్ని కాపాడండి.



- చీర్నపల్లి నవిత,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
జక్కాపూర్.

పెన్సిల్ - రబ్బరు



ఒక ఊరిలో ఓ పెన్సిల్ ఉంది. దాని పేరు పద్మ. అది ఎంతో అందంగా బొమ్మలు వేస్తుంది. కవితలు, కథలు రాస్తుంది. ఒకసారి పద్మ వేసిన డ్రాయింగ్‌కి పెద్ద బహుమతి వచ్చింది. పద్మని అభినందిద్దామని అందరూ వచ్చారు. పద్మని స్టేజీపైకి పిలిచారు. శాలువా కప్పి అవార్డు ఇస్తూ పద్మని అక్కడున్న వారంతా ఎంతో పొగిడారు. చివరగా పద్మని మాట్లాడమన్నారు.

పద్మ మైక్ తీసుకుంది. దానికి మాటలు రావడం లేదు. అలా మౌనంగా నిలబడింది. కాసేపటికి వెక్కివెక్కి ఏడ్చింది. ఎంతమంది ఆపినా అది ఏడుపు ఆపలేదు. అందరూ కంగారు పడ్డారు. ఏమైందని ఆందోళన చెందారు. అప్పుడు పద్మ ఇలా చెప్పింది.

'ఫ్రెండ్స్ ఇప్పుడు అందరూ నేను చేసిన పనికి మెచ్చుకుంటున్నారు. ఘనంగా సన్మానించారు. కానీ నా ఈ కృషి వెనుక మరొకరు ఉన్నారు. నేను చేసిన ప్రతి తప్పుని సరిదిద్దుతూ, నా రాతలని, గీతలని చక్కగా వచ్చేలా చేశారు. అది ఎవరో కాదు. నా స్నేహితుడు 'రబ్బరు'. అది లేకపోతే నేను ఈరోజు ఇది సాధించేదాన్ని కాదు. కానీ అందరూ నన్ను మాత్రమే పొగుడుతున్నారు. నా వెనుక అది చేసిన కృషిని ఎవరూ గుర్తించలేదు. అందుకే ఈ అవార్డు, పొగడ్తలు అన్నీ నా 'రబ్బరు' స్నేహితునికే అంకితం' అని పెన్సిల్ పద్మ స్టేజి దిగింది. అప్పుడు అక్కడున్న వారంతా చప్పట్లతో తమ అభినందనలు తెలియజేశారు.

ఫ్రెండ్స్, మనం తెలిసీతెలియక ఎన్నో తప్పులు చేస్తాం. అప్పుడు మన తల్లిదండ్రులు, టీచర్లు, పెద్దలు మనల్ని సరిదిద్ది మంచిమార్గంలో నడిచేలా చేస్తారు. పెరిగి పెద్దాయ్యాక, మనం ఉన్నత స్థానాలు అధిరోహించాక వాళ్లు మనపట్ల చూపించిన ప్రేమని ఎప్పటికీ మర్చిపోకూడదు. ఈ కథ ద్వారా నేను అదే చెప్పాలనుకున్నాను. మీకు నచ్చిందా ఫ్రెండ్స్..



- అన్ని పద్మ, 7వ తరగతి,
ఎన్‌ఎస్‌ఎం స్కూలు,
లిటిల్ హోప్ ట్రస్ట్ వాలంటీర్,
విజయవాడ,
98859 23373.


బొమ్మల కొలువు





ఎ.సాయి రేఖశ్రీ,
5వ తరగతి,
సిస్టర్ స్టానిస్లాస్ ఇంగ్లీష్ స్కూలు,
కర్నూలు.





కె.మంజుల,
8వ తరగతి,
ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాల,
మహానంది (మం),
నంద్యాల జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

JEEVANA జీవన the family

జీవన సౌరభం

లక్ష్యముండటమే కాదు,
దాన్ని ఎంత త్వరగా వీలైతే
అంత త్వరగా సాధించుకునే వ్యూహ
నైపుణ్యం కూడా ఉండాలి.

'తార' బొమ్మల ఇల్లు

చెన్నైకి చెందిన వీణ అందరికీ బెంగుళూరు వాసిగా సుపరిచితురాలు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్లో డిగ్రీ, హ్యూమన్ రిసోర్స్‌లో మాస్టర్స్ చేశారు. కార్పోరేట్ సెక్టార్‌లో కెరియర్ మొదలుపెట్టారు. దశాబ్దం పాటు ప్రముఖ కంపెనీల్లో ఉన్నత హోదాల్లో పనిచేశారు. అయితే 2015 తరువాత వీణ ఆ రంగం నుండి పూర్తిగా వైదొలగారు. పెళ్లి తరువాత భర్త ప్రారంభించిన స్టార్టప్‌కి మద్దతుగా నిలిచారు. ఇలా సాగిపోతున్న వీణ జీవితం తార వచ్చాక పూర్తిగా మారిపోయింది.



పిల్లలు అడిగారని ఎన్నో బొమ్మలు కొనిపెడతాం. ప్లాస్టిక్, సింథటిక్, రకరకాల హానికర రంగుల్లో దొరికే ఆ బొమ్మలతో పిల్లలకు చేటు అని తెలిసినా కొంటుంటాం. అయితే బెంగుళూరుకి చెందిన వీణా పీటర్ అలా చేయలేదు. తన గారాలపట్టి తార కోసం ఎంతో అందమైన బొమ్మని తనే స్వయంగా తయారు చేసింది. ఉన్ని ఉపయోగించి చేత్తో కుట్టిన ఆ బొమ్మకి ముచ్చటైన దుస్తులు తొడిగింది. పొడవాటి జుట్టుతో, మెత్తగా అమ్మలాంటి స్పర్శతో ఉన్న ఆ బొమ్మని చూసి తార వేసిన గంతులకు వీణ ఎంతో మురిసిపోయింది. ఇప్పుడు వీణ పొందిన ఆ ఆనందం ఆమెకి మాత్రమే పరిమితం కాలేదు. ఎందరో అమ్మలకి కూడా చేరింది.

అందరు అమ్మల్లాగే వీణకి కూడా తార పుట్టాక తారే లోకంగా మారింది. ఎప్పుడూ తనకేం కావాలో, తను కంఫర్ట్‌గా ఉండాలంటే తానేం చేయాలో అన్న ఆలోచనలే ఉండేవి. ఆ పరిస్థితిని వీణ ఇలా చెబుతోంది. 'నేను నా కూతురుని టీవీకి వదిలేయాలనుకోలేదు. అందుకోసం నేను మొట్టమొదట నా ఫోనుని వదిలేశాను. నేను, తను.. ఇదే ప్రపంచంగా ఉండాలనుకున్నాను. స్క్రీన్ నుండి నా బిడ్డ ఎంత దూరంగా ఉంచగలనో అంత దూరం పెట్టాను. అప్పుడు తనతో గడిపిన ప్రతి క్షణం నాకు ఓ మధుర జ్ఞాపకంలా మిగిలిపోయింది' అని తార గురించి వీణ చెబుతున్నప్పుడు ఆ కళ్లల్లో ఎంత ప్రేమ కనిపించిందో!

'తారా' లోకంలో విహరిస్తున్నప్పుడే వీణకి ఓ విషయం అర్థమైంది. తార ఆడుకునే ప్రతి బొమ్మ హానికర ప్లాస్టిక్‌తో తయారైంది. ఆ బొమ్మలని పట్టుకుని అలాగే పడుకున్న తారకి ఏదైనా దెబ్బ తగులుతుందేమో అన్న భయంతో వాటిని ఎన్నోసార్లు వేరుచేసి పెట్టేది. పొడుగాటి వీణ జుట్టుపై తన చిన్ని ముక్కుని ఆనించి హాయిగా నిద్రపోతున్న తారని చూసిన ఆ క్షణమే వీణలో మెరుపులాంటి ఓ ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన 'తారా డాల్స్ హౌస్' వరకు నడిపించింది.

తను పక్కన ఉన్నా లేకపోయినా బొమ్మలు తారకి సాంత్వన ఇచ్చేవిగా ఉండాలని అనుకుంది. ఆన్‌లైన్లో వెతికింది. ఎక్కడా తను అనుకున్న బొమ్మలు కనిపించలేదు. లాభం లేదనుకుని ఈసారి తనే రంగంలోకి దిగింది. ఇంట్లో వృథాగా ఉన్న దుస్తులు, ఉన్నితో ఓ బొమ్మ కుట్టింది. అందమైన బట్టలు వేసింది. తారకి ఇష్టమైనట్లు పొడవాటి జుట్టు అమర్చింది. మొదట ఎన్నో గంటలు శ్రమించింది. ఒక రూపం వచ్చాక తారకి ఇచ్చింది. ఆ బొమ్మ తారకే కాదు, తన స్నేహితులకి కూడా బాగా నచ్చేసింది.



వీణ తయారుచేసిన బొమ్మలు పిల్లలకే కాదు, వాళ్ల తల్లులకు కూడా తెగ నచ్చేశాయి. తమ కోసం కూడా వాటిని తయారుచేయమని అడిగారు. అలా వీణ బొమ్మలు బిజినెస్ రూపంలోకి మారాయి. మొదట 30 బొమ్మలను ఆన్‌లైన్లో విక్రయానికి పెట్టింది. సాయంత్రంలోగా అవన్నీ అమ్ముడైపోయాయి. వీణకి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. డబ్బులు వచ్చినందుకు కాదు. తన బిడ్డ పొందిన ఆనందం ఇంకా ఎంతోమంది చిన్నారులకు కూడా దక్కిందని.

2023లో ప్రారంభమైన ఈ బిజినెస్‌కి 'తారా డాల్స్ హౌస్' అని నామకరణం కూడా చేశారు. సోషల్‌మీడియా ద్వారా విస్తృత ప్రచారం పొందిన ఈ హౌస్ ఇటీవల కాలం నుండి బాగా వైరల్ అయ్యింది. ఇప్పుడు వీణ, ఈ బొమ్మల ద్వారా నెలకి రూ.2 లక్షలు సంపాదిస్తోంది. ముగ్గురు మహిళలకి ఉపాధి కల్పిస్తోంది.

బిజినెస్ గురించి వీణ ఇలా చెబుతోంది. 'ఇది నేను కావాలని చేసింది కాదు. మొదట్లో బొమ్మలకు ఖరీదు ఎంత వేయాలో కూడా తెలిసేది కాదు. ఇక్కడ ధర ముఖ్యం కాదు. అమ్మ ప్రేమ, పిల్లల సౌకర్యం ముఖ్యం. అందుకే నేను ప్రతి బొమ్మలో 100 శాతం కాటన్ ఉపయోగిస్తాను. నేను తయారుచేసే బొమ్మలకు దుస్తులను అతికించి కుట్టేయను. ఎందుకంటే బొమ్మలకు దుస్తులు వేయడం పిల్లలకి ఓ మంచి వ్యాపకంలా ఉండాలి. చిన్న చిన్న మెషిన్లతో, ఎక్కువశాతం చేతులతో వీటిని తయారుచేస్తాం. మొదటి బొమ్మని రెండురోజులు తయారు చేశాను. ఇప్పుడు నా బృందం సాయంతో వారానికి 200 బొమ్మలు తయారుచేస్తున్నాను. ఆన్‌లైన్లో పెట్టిన గంటల్లోనే అవన్నీ అమ్ముడైపోతున్నాయి. అప్పుడు భలే ఆనందం వేస్తుంది. నాలాంటి అమ్మలందరూ నన్ను అభినందిస్తుంటే వారి కళ్లల్లో ఆ పిల్లల ముఖాలే నాకు కనిపిస్తాయి' అంటున్న వీణ ఒకసారి తార స్కూల్లో జరిగిన ఫ్యాషన్ షోకి గెస్ట్‌గా వెళ్లింది. అప్పుడు తనకెదురైన అనుభవం గురించి ఇలా చెబుతోంది.

'తార అందమైన దుస్తులతో ఫ్యాషన్ షోలో పాల్గొంది. చివర్లో 'నువ్వు పెద్దయ్యాక ఏమవ్వాలనుకుంటున్నావు' అని అడిగాను. అప్పుడు 'నీలాగా.. ఎందుకంటే నువ్వు నా కోసం ఎంతో చేశావు అమ్మా..' అని తార అంటుంటే నా మనసు గర్వంతో ఉప్పొంగింది' అంటున్న వీణ లాంటి అమ్మ, తార లాంటి కూతురు ఎంతోమందికి ఆదర్శం.

త్వరలో పహల్గామ్‌కి వెళతాను



కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' చిత్రం జూన్ 5న రిలీజ్ కాబోతోంది. దీంతో చిత్రబృందం వరుస ప్రమోషన్లు చేస్తోంది. మణిరత్నం డైరెక్షన్‌లో వస్తోన్న ఈ సినిమాలో శింబు, త్రిష కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా కమల్ హాసన్ ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇందులో కీలక విషయాలను వెల్లడించారు. 'థగ్ లైఫ్' ను ఒక భావోద్వేగ పరిస్థితుల ఆధారంగా తీశామన్నారు. ఇప్పటి వరకు తమ టీమ్ చాలా కష్టపడిందని.. ఈ మూవీ హిట్ అయితే చూడాలని ఉందని చెప్పారు. 'ప్రస్తుతం ఆపరేషన్ సిందూర్ జరుగుతోంది. ఓ వైపు దేశ వ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు ఉంటే మనం సెలబ్రేషన్స్ చేసుకోవడం కరెక్ట్ కాదు. అందుకే మా సినిమా ఈవెంట్లు చాలా వరకు వాయిదా వేసుకున్నాం. ఇప్పటికీ 'థగ్ లైఫ్' ఈవెంట్లు అనుకున్న స్థాయిలో చేయట్లేదు. త్వరలోనే పహల్గాంకు వెళ్తాను. అక్కడ టూరిజాన్ని పెంచడం మన బాధ్యత. అది కూడా నా దేశంలో భాగమే. కాబట్టి అక్కడకు వెళ్లి టూరిస్టులకు ధైర్యం చెబుతాను. దేశంలోని అన్ని ప్రాంతాలు మనవే. కాబట్టి దేశంలో ఎక్కడ ఏం జరిగినా నాకు కచ్చితంగా బాధ్యత ఉంటుంది. ఆ బాధ్యత ప్రకారమే నేను ఇప్పటి వరకు నడుచుకుంటున్నా'ను అని కమల్ హాసన్ మాట్లాడారు.



నారా రోహిత్ కాబోయే సతీమణి శిరీష

'ఓజీ'లో శిరీష లేళ్ల

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓజీ'. శిరీషా (శిరీష లేళ్ల) ఈ సినిమాలో ఓ కీలకపాత్రలో నటించబోతున్నారు. ఈ మూవీలో ప్రియాంకా మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మి ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. సుజిత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో జరుగుతోందని తెలిసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. 'ప్రతినిధి2' సినిమాలో నారా రోహిత్ సరసన శిరీష నటించిన విషయం తెలిసిందే. ఈ మూవీతో మొదలైన వారి స్నేహం ప్రేమగా మారింది. ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో గతేడాదిలో నిశ్చితార్థం జరిగింది. త్వరలో ఏడడుగుల బంధంతో ఒకటి కానున్నారు. భైరవం సినిమాతో నారా రోహిత్, ఓజీ సినిమాతో శిరీషా ఈ ఏడాదిలో తెరపై సందడి చేయనున్నారు. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యని అభ్యసించిన శిరీషా స్వస్థలం రెంటచింతల.

టాప్-2లోకి బెంగళూరు

- లక్నోపై ఆరు వికెట్ల తేడాతో గెలుపు
- ముగిసిన ఐపిఎల్ లీగ్ మ్యాచ్‌లు
- ప్లే ఆఫ్స్‌లో బెంగళూరుతో పంజాబ్.. గుజరాత్‌తో ముంబయి ఢీ

లక్నో: చివరి లీగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్ కెప్టెన్, వికెట్ కీపర్ రిషభ్ పంత్ అజేయ శతకంతో మెరిసినా.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 228పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి ఔరా అనిపించింది. నిర్ణయాత్మక మ్యాచ్‌లో నెగ్గిన బెంగళూరు జట్టు టాప్-2లోకి ఎగబాకింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు బెంగళూరు ముందు 228పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఆ లక్ష్యాన్ని బెంగళూరు జట్టు 18.4ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 230పరుగులు చేసి విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఇదే భారీ ఛేదన కాగా.. బెంగళూరు జట్టు కూడా ఇంత పెద్ద భారీ లక్ష్యాన్ని ఛేదించడం ఇదే తొలిసారి. బెంగళూరు జట్టులో కోహ్లి(54), మయాంక్ అగర్వాల్(41నాటౌట్), జితేశ్ శర్మ(85నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జితేశ్ శర్మకు దక్కింది.



పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
పంజాబ్	14	9	4	1	19	+0.37
బెంగళూరు	14	9	4	1	19	+0.30
గుజరాత్	14	9	5	0	18	+0.25
ముంబయి	14	8	6	0	16	+1.14
ఢిల్లీ	14	7	6	1	15	+0.01
సన్‌రైజర్స్	14	6	7	1	13	-0.24
లక్నో	14	6	8	0	12	-0.37
కోల్‌కతా	14	5	7	2	12	-0.30
రాజస్తాన్	14	4	10	0	8	-0.54
చెన్నై	14	4	10	0	8	-0.64

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

అంతకుముందు ఈ సీజన్‌లో రికార్డు ధర పలికిన పంత్ ఆఖరి పోరులో తనదైన షాట్లతో అలరిస్తూ మెరుపు సెంచరీతో విరుచుకుపడ్డాడు. సొంత మైదానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లకు ముచ్చెమటలు పట్టించిన పంత్.. ఓపెనర్ మిచెల్ మార్ష్(67)తో రెండో వికెట్‌కు కలిసి 152 పరుగులు జోడించాడు. అనంతరం నికోలస్ పూరన్(13) జతగా స్కోర్ బోర్డును పరుగెత్తించాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 227పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ గత మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌కు షాకిచ్చినట్లే.. ఈసారి ఆర్సీబీపై చెలరేగింది. ఆరంభంలోనే ఓపెనర్ మాథ్యూ బ్రీట్జ్(14)ను నువాన్ తుషార యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. దాంతో 25 వద్ద లక్నో మొదటి వికెట్ పడింది. మిచెల్ మార్ష్(67), రిషభ్ పంత్(118 నాటౌట్)లు.. ఇన్నింగ్స్ నిర్మించే బాధ్యత తీసుకున్నారు.

ప్లే-ఆఫ్స్ బెర్త్‌లు ఖరారు..

చివరి లీగ్ మ్యాచ్‌లో నెగ్గిన బెంగళూరు జట్టు టాప్-2లోకి ఎగబాకింది. దీంతో 29న జరిగే తొలి క్వాలిఫయర్‌లో బెంగళూరు జట్టు పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు ఎలిమినేటర్-2లో ఎలిమినేటర్-1 విజేతతో తలపడాల్సి ఉంటుంది. ఇక 30న గుజరాత్ జెయింట్స్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య ఎలిమినేటర్-1 మ్యాచ్ జరగనుంది.

'సినిమా బంద్'పై విచారణ

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జూన్ ఒకటి నుండి సినిమా థియేటర్లను బంద్ చేస్తామంటూ వెలువడిన ప్రకటన వెనుక ఉన్న శక్తులెవరో విచారించాలని డిప్యూటీ ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి సూచించారు. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పవన్ కల్యాణ్‌ను మంగళవారం కలిశారు. ఈ సంద ర్భంగా సినిమా పరిశ్రమలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలను, ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సినిమా రంగంలో అవాంఛనీయ పరిస్థితులకు కారణమైన బంద్ ప్రకటన వెనుక ఉన్న గల వ్యక్తులు, కారణాలను వెలికితీయాల్సిఉందన్నారు. జనసేన పార్టీకి చెందిన వారు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దని చెప్పారు. ఈ సందర్భంగా ఒక ప్రముఖ నిర్మాత మీడియా ముందుకు వచ్చి ఆ ప్రకటన వెనుక జనసేన నాయకుడు ఉన్నారంటూ చేసిన ప్రకటన ఇరువురి మధ ప్రస్తావనకు వచ్చింది. ఇటువంటి బెదిరిపులకు భయపడేది లేదని, అటువంటి అనారోగ్యకర వాతావరణానికి తావు ఇయ్యవద్దని సూచించారు. రాష్ట్రంలో సినిమా హాళ్ల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. కొత్త చిత్రాల విడుదల సమయంలో టిక్కెట్ల రేట్లు పెంపు ఇక నుండి చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే జరగాలని, తన సినిమాల విషయంలోనూ అదే పద్ధతి అవలంభించాలని చెప్పారు.

రాజమహేంద్రవరం ఇన్‌ఛార్జి పై వేటు

థియేటర్ల బంద్ ప్రకటనలో ప్రమేయం ఉందని పేర్కొంటూ జనసేన పార్టీ రాజమహేంద్రవరం ఇన్‌ఛార్జి అత్తి సత్యనారాయణ (అనుశ్రీ సత్యనారాయణ)ను పార్టీ నుండి సస్పెండ్ చేశారు. ఆయన ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దు చేశారు. ఈ వ్యవహారంలో ఆయన ప్రమేయం లేదని నిరూపించుకోవాలని సూచించారు.

'కన్నప్ప' హార్డ్ డిస్క్ మిస్

మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'కన్నప్ప' సినిమా త్వరలో విడుదల కానుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకి సంబంధించిన హార్డ్ డిస్క్ ఒకటి మిస్ అయిందంటూ మంగళవారం ఉదయం కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు అయినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయంపై మంచు విష్ణు నిర్మాతగా వ్యవహరిస్తున్న 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ సంస్థ స్పందించింది. ముంబై నుంచి హైదరాబాద్ రావాల్సిన ఒక హార్డ్ డిస్క్ మిస్ అయిందని, అందులో ఇద్దరు లీడ్ యాక్టర్స్ మధ్య ఉన్న కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ ఉందని, దానికి సంబంధించిన విఎఫ్‌ఎక్స్ వర్క్‌తో కూడిన హార్డ్ డిస్క్‌నే మిస్ అయిందని చెప్పారు. ముంబైలోని హైవ్ స్టూడియోస్ నుంచి హైదరాబాదులోని ప్రొడక్షన్ హౌస్ ఆఫీస్‌కి రావాల్సి ఉందని వెల్లడించారు. చరిత అనే ఒక మహిళ ఆదేశాల ప్రకారం రఘు అనే వ్యక్తి దాన్ని ఆఫీస్ అడ్రస్ నుంచి సైన్ చేసి తీసుకున్నాడు. అయితే రఘు కానీ చరిత కానీ ఇద్దరికీ 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీతో సంబంధం లేదు. సుమారు నాలుగు వారాల క్రితమే దీనికి సంబంధించి పోలీస్ కంప్లైంట్ ఇచ్చామని, దీని వెనక ఎవరున్నారో అధికారులు మా దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. 'తెలుగు సినిమా ఖండంతరాలు దాటుతున్న సమయంలో ఇలాంటి ప్రయత్నాలు ఏమాత్రం సరికాదు. ఒకవేళ పైరసీ కంటెంట్ వచ్చినా సరే, పబ్లిక్ గానీ మీడియా గానీ దాన్ని ఎంటర్టైన్ చేయవద్ద'ని సంస్థ కోరింది.

సిఐడి మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్ పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఐడి మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. పొడిగింపు నవంబరు వరకు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. అఖిల భారత సర్వీస్ నిబంధనల ఉల్లంఘనలపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. సంజయ్‌పై వచ్చిన అభియోగాల విచారణపై ఏర్పాటైన కమిషన్ సిఫార్సులతో 2024 డిసెంబరు 3న సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అనంతరం సస్పెన్షన్‌ను 2025 మే 31 వరకు పొడిగించింది. తాజాగా సస్పెన్షన్‌ను మరోసారి నవంబరు వరకు పొడిగించింది.

గుల్వీర్ సింగ్‌కు స్వర్ణం

ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



గుమీ(దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ బోణి కొట్టింది. తొలిరోజే గుల్వీర్ సింగ్ స్వర్ణ పతకంతో మెరిశాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగును 28 నిమిషాల 38 నిమిషాల 63 సెకన్లలో ముగించి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలోనే గుల్వీర్ జాతీయ రికార్డు కూడా నెలకొల్పాడు. మెబుకి సుజుకీ(జపాన్) 28 నిమిషాల 43 నిమిషాల 84 సెకన్లతో ముగించి రజత పతకం, ఆల్బర్ట్ కిబిచి రోప్(బహ్రెయిన్) 28 నిమిషాల 46.82 సెకన్లతో కాంస్య పతకం గెలుచుకున్నాడు. తద్వారా ఈ టోర్నీ 10 వేల పరుగులో స్వర్ణం సాధించిన మూడో భారతీయుడిగా గుల్వీర్ రికార్డు నెలకొల్పాడు. అతడి కంటే ముందు హరి చంద్(1975), జీ. లక్ష్మణన్(2017)లు ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో పసిడితో పోడియం మీద భారత పతాకాన్ని రెపరెపలాడించారు. గుల్వీర్ సింగ్ మరో పతకం సాధించే అవకాశం కూడా ఉంది. 30న జరిగే పురుషుల 5వేల మీటర్ల ఫైనల్లో అతను పాల్గొననున్నాడు. 5 వేల మీటర్ల రేసులో గుల్వీర్‌కు మంచి రికార్డు ఉంది.

20 కి.మీ. నడకలో సెబాస్టియన్‌కు కాంస్యం

ఇక పురుషుల 20 కి.మీ నడకలో సెర్విన్ సెబాస్టియన్ 1 గంట 21 నిమిషాల 13.60 సెకన్లు కాంస్యం సాధించాడు. చైనాకు చెందిన వాంగ్ జావోజావో 1 గంట 20 నిమిషాల 36.90 సెకన్లు స్వర్ణ పతకం అందుకోగా.. జపాన్‌కు చెందిన కెంటో యోషికావా 1 గంట 20 నిమిషాల 44.90 సెకన్లు రజతం దక్కించుకున్నాడు. మహిళల జావెలిన్‌త్రోలో అన్నురాణి తృటిలో కాంస్యం పతకం చేజార్చుకుంది. అన్నురాణి బెస్ట్ త్రో 58.30 మీటర్లు కాగా.. 64 సెంటీమీటర్ల తేడాతో నాలుగో స్థానంలో నిలిచి మెడల్‌ను మిస్ చేసుకుంది. జపాన్‌కు చెందిన సే టకేమోటో (58.94 మీటర్లు) కాంస్య పతకం సాధించింది.

వావ్రింకా, మెద్వదెవ్ ఔట్

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో పెను సంచలనం నమోదైంది. 2015 ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ విజేత, స్విట్జర్లాండ్‌కు చెందిన స్టాన్ వావ్రింకా, రష్యాకు చెందిన 11వ సీడ్ మెద్వదెవ్ తొలిరౌండ్‌లోనే అనూహ్యంగా ఓటమిపాలయ్యారు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో వావ్రింకా 6-7(6-8), 3-6, 2-6తో బ్రిటన్‌కు చెందిన జాకోబ్ ఫెన్లే చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. ఓటమి అనంతరం మాట్లాడు తూ.. తాను టెన్నిస్‌ను ఆస్వాదిస్తానని, తొలిరౌండ్‌లోనే ఓడినా.. రాబోయే టోర్నీలో రాణిస్తానన్న నమ్మకం ఉందని తెలిపాడు. ఇతర పోటీల్లో 6వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ 6-3, 6-3, 6-3తో అమెరికాకు చెందిన మెక్ డొనాల్డ్‌ను, 3వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ) 6-3, 6-3, 6-4తో టిన్(అమెరికా) ను ఓడించారు. ఇతర పోటీల్లో 9వ సీడ్ డి-మినార్(ఆస్ట్రేలియా), 16వ సీడ్ డిమిట్రోవ్(పోలండ్) తొలిరౌండ్ గండం గట్టెక్కారు. ఇక మెద్వదెవ్ 5-7, 3-6, 6-4, 6-1, 5-7తో అన్‌సీడెడ్ నొర్రీ(బ్రిటన్) చేతిలో ఓటమిపాల య్యాడు. మరో పోటీలో టాప్‌సీడ్, ఇటలీకి చెందిన సిన్నర్ 6-4, 6-3, 7-5తో రిండెర్నిక్(ఫ్రాన్స్)ను చిత్తుచేసి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు.

కెనిన్ దూకుడు...

ఇక మహిళల సింగిల్స్‌లో 31వ సీడ్, అమెరికాకు చెందిన కెనిన్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. తొలిరౌండ్‌లో కెనిన్ 6-3, 6-1తో ఫ్రాన్స్‌కు చెందిన గ్రాచేవాను చిత్తుచేయగా.. వోంద్రుసోవా(చెక్) 6-4, 6-4తో సలెక్టమోవా(రష్యా)ను ఓడించింది. మరో పోటీలో 6వ సీడ్ ఆంద్రీవా(రష్యా) 6-4, 6-3తో బుస్కా(స్పెయిన్)పై గెలుపొందగా.. 23వ సీడ్ హడాడ్ మల(దక్షిణాఫ్రికా) 6-4, 3-6, 1-6తో అమెరికాకు చెందిన బాప్టి) చేతిలోఓటమిపాలైంది. ఇక 3వ సీడ్ అమెరికాకు చెందిన పెగూల 6-2, 6-4తో జర్మనీకి చెందిన టొడోనిని ఓడించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68